తొలి ప్రైవేట్ రాకెట్... షార్‌లో ఏర్పాట్లు





2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 1 జూలై 2026 | సంపుటి: 10 | సంచిక: 176 | పేజీలు:12 | వెల రూ.5

1500 కిలోమీటర్ల పొడవైన వర్షమేఘం..!



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## కేసీఆర్ అప్పులు కడుతూనే ఉన్నాం

### రూ.2.08 లక్షల కోట్ల అప్పులు



- అయినా అన్నదాతలకు డబుల్ సాయం
- 'రైతు భరోసా' విడుదల సభలో భట్టి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): గతంలో కేసీఆర్ చేసిన అప్పుల కోసం ప్రభుత్వం రూ. 2 లక్షల 8 వేల కోట్లు కేవలం అప్పులు కట్టడానికే ఉపయోగిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. శిల్పకళావేదికలో అట్టహాసంగా నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తమ ప్రభుత్వానికి రైతుల కష్టాలు, వారి పంట కొనుగోలు సమస్యలు పూర్తిగా తెలుసన్నారు. అందుకే రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేశామని, అన్నదాతలకు పూర్తి భరోసా కల్పించేందుకే ఈ నిధులను విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు భరోసా ఇచ్చి తీరుతామని, తాము అబద్ధాలు చెప్పి పొద్దు గడుపుకునే రకం కాదని హితవు పలికారు.గత ప్రభుత్వంలోని బావబామ్మర్దుల (కేసీఆర్, హరీష్ రావు) తీరుపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ...మిగతా 2లో

## సర్వర్ డౌన్.. సేవలు నిల్

### నిలిచిపోయిన భూముల రిజిస్ట్రేషన్లు

### సర్వర్ల పునరుద్ధరణకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 30 (మనం ప్రతినిధి): సర్వర్లు అప్ డేట్.. తెలంగాణలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తలనొప్పిగా మారింది. గత నెలలో మూడు రోజుల విరామం తర్వాత.. తెరచుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం మరోసారి తెలంగాణ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలు ...మిగతా 2లో



# రైతు సం'క్షేమ'మే లక్ష్యం

## రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు చెల్లించాం

- వరిసాగు తగ్గించి మెట్టపంటలు వేయండి
- ఒక్క కుటుంబం రూ. 7వేల కోట్లు అప్పు చేసింది
- అసెంబ్లీలో చర్చకు కేసీఆర్‌కు సవాల్
- రైతు భరోసాతో ముందుకు సాగుతాం
- తొలివిడతలో 41.37 లక్షల మంది రైతులకు సాయం
- రూ.2,482 కోట్లు నిధుల విడుదల
- రైతు భరోసా నిధుల విడుదల సభలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ రైతుల సంక్షేమం కోసం నిరంతరం తమ ప్రభుత్వం పాటుపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలోని శిల్పకళావేదికలో మంగళవారం నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ...మిగతా 2లో

### కొత్త సీఎస్ సంజయ్ జాజు

## బాధ్యతలు స్వీకరణ



హైదరాబాద్, జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ...మిగతా 2లో

## రేపు.. కేబినెట్ కీలక భేటీ

### ఉత్తర్వులు జారీ చేసిన చీఫ్ సెక్రటరీ

హైదరాబాద్,జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర కేబినెట్ గురువారం అత్యవసరంగా భేటీ కానుంది. ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈక్రమంలో సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్లో జరిగే ఈ 34వ మంత్రిమండలి కీలక భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం ...మిగతా 2లో

### బండి సంజయ్‌కి

## ఊరట



హైదరాబాద్,జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది.వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది.ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.





### ఇక...మేడ్ ఇన్ తెలంగాణ

## హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ విమానయానం

- గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు ఆహ్వానం
- ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ల పనులు ప్రారంభం
- కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్'
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో మంగళవారం జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని ప్రకటించారు. ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోందని, పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా' అని స్పష్టం చేశారు.భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత,ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. 'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుందని, అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా ...మిగతా 2లో



## ఆలయాలకే భూమి హక్కులు

### హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు భూ కేటాయింపులు

- గుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దండి
- 'గుట్ట' సమగ్రాభివృద్ధి, భూ కేటాయింపులపై
- ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్,జూన్ 30 (మనం ప్రతినిధి): దేవాదాయ ధర్మాదాయ పరిధిలోకి వచ్చే భూములు, స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, వాటిపై పూర్తి యాజమాన్య హక్కులు ఖచ్చితంగా ఆలయాలకే ఉండేలా? అ దిశగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల ...మిగతా 2లో

### రెండు మహాసాగరాలు.. మంట పుట్టిస్తున్నాయి!

అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రం... ఆ రెండు మహాసాగరాలు భూగోళానికి చెరోవైపున ఉన్నాయి. వాటి మధ్య వేల కిలోమీటర్ల దూరం ఉంది. కానీ ఆ రెండూ ఇప్పుడు కోట్ల మంది అతలాకుతలం చేస్తున్నాయి.



9

## ప్రత్యేక పోలీస్ మరింత బలోపేతం



- పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యం
- ఫ్యూచర్ సిటీతో కొత్త బెటాలియన్‌లు
- డీజీపీ సీ.వీ ఆనంద్ వెల్లడి

హైదరాబాద్, జూన్ 30(మనం,ప్రత్యేక ప్రతినిధి): శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల,విపత్తు నిర్వహణ, వీఐపీ బందోబస్తు, ప్రత్యేక ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న స్పెషల్ బెటాలియన్‌లను మరింత బలోపేతం చేస్తామని డీజీపీ సి.వి. ఆనంద్ ...మిగతా 2లో






### వెనెజువెలా భూకంపం..

## 58వేల భవనాలు ధ్వంసం



కారకస్, జూన్ 30: ఇటీవల సంభవించిన జంట భూకంపాలు వెనెజువెలాకు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఆ దేశంలో 58 వేలకుపైగా భవనాలు ధ్వంసమైనట్లు నాసా అంచనా వేసింది. జూన్ 25న సేకరించిన ఉపగ్రహ డేటా ఆధారంగా ఈ లెక్కలు వెల్లడించింది. క్షేత్రస్థాయిలో విధ్వంస ప్రభావాన్ని అంచనావేసి, సహాయక బృందానికి మార్గనిర్దేశం చేసేందుకు ఈ శాటిలైట్ డేటా ఉపయోగపడుతుందని నాసా పేర్కొంది. అయితే.. 855 భవనాలు దెబ్బతిన్నాయని, వాటిలో 189 పూర్తిగా ధ్వంసమయ్యాయని వెనెజువెలా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్ వెల్లడించడం గమనార్హం. ఈ భవన శిథిలాల కింద వేల సంఖ్యలో ప్రజలు చిక్కుకొని ఉంటారనే ఆందోళన నెలకొంది. వారిని బయటకు తీసినా ప్రాణాలతో ...మిగతా 2లో



### భూకంప విలయం..

## 13 మందిని కాపాడిన 'సునామీ'

కారకస్, జూన్ 30: వెనెజువెలాలో ఇటీవల సంభవించిన జంట భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విపత్తు జరిగి వారం రోజులు కావొస్తున్నా.. ఇంకా వేలాది ...మిగతా 2లో

### అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లు..

## అదేమిలేదన్న భారత సైన్యం

ఈటానగర్, జూన్ 30: చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం అవుతున్నాయి. వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. "అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారం" అని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్‌లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల ...మిగతా 2లో






మనం Manam



# తొలి ప్రైవేట్ రాకెట్... షార్‌లో ఏర్పాట్లు

**శ్రీహరికోట, జూన్ 30:** భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలోని హైదరాబాద్ అంకురం స్కైరూట్ ఏరో స్పేస్ మరో మైలు రాయిని చేరుకుంది. శ్రీహరికోటలోని ఇస్రో ఫస్ట్ లాంచ్ ప్యాడ్ వద్ద విక్రమ్-1 రాకెట్ మొదటిదశను విజయవంతంగా అమర్చింది.

ఇది తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్. ప్రైవేట్‌గా రూపొందించిన దీనిని ఇస్రో ఫస్ట్ లాంచ్ ప్యాడ్‌పై అమర్చడం ఇదే మొదటిసారి. ఇందుకు సంబంధించిన చిత్రాలను స్కైరూట్ 'ఎక్స్'లో షేర్ చేసింది. ఒక్కో భాగం చొప్పున విక్రమ్-ఐ రూపుదిద్దుకుంటోందని స్కైరూట్ తెలిపింది. ప్రతి దశను జాగ్రత్తగా అమర్చి, ప్రయోగానికి సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించింది. స్కైరూట్ ఏరోస్పేస్ కొన్ని రోజుల్లో తన తొలి కక్ష్య ప్రయోగాన్ని విక్రమ్-1 రాకెట్‌తో చేపట్టనుంది. చిన్న ఉపగ్రహాలను భూమికి సమీప కక్ష్యలోకి తీసుకువెళ్లడానికి దీనిని రూపొందించారు.

# 1500 కిలోమీటర్ల పొడవైన వర్షమేఘం..!

**ఢిల్లీ, జూన్ 30:** రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినా దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరభారత ప్రజలు ఎండల్లోనే మండుతున్నారు. ఎట్టకేలకు వారికి చల్లని కబురు వచ్చింది. బంగాళాఖాతంలోని ఉత్తరభాగం నుంచి జమ్మూకశ్మీర్ వరకు దాదాపు 1500 కి.మీ.పొడవంతా మేఘావృతమైనట్లు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది.

ఈ ప్రాంతంలో రుతుపవన ద్రోణి ఏర్పడిందని భారత వాతావరణ విభాగం కూడా వెల్లడించింది. అయితే అది బాహ్య హిమాలయాల సమీపంలో ఉందని పేర్కొంది. అది ఇప్పుడు క్రమంగా దక్షిణంవైపుగా కదులుతోంది. దీంతో జులై 1 నుంచి జులై 4 మధ్య ఉత్తరభారతంలో రుతుపవనాల ప్రభావం కనిపించనుందని అంచనా వేసింది. ఐఎండీ అంచనాలకు భిన్నంగా ఇంతకాలం ఇక్కడ రుతుపవనాల ప్రభావం మందకొడిగా కొనసాగింది.

వర్షాల కురిసేముందు తేమ నిండిన గాలులు ఒక రేఖలాగా ఏర్పడటాన్ని రుతపవన ద్రోణి అంటారు. వేసవిలో భారత భూభాగం తన చుట్టుపక్కల ఉన్న సముద్రాలకంటే వేగంగా వేడెక్కుతుంది. ఇది అరేబియా సముద్రం, బంగాళాఖాతం నుంచి తేమతో కూడిన గాలులను ఆకర్షించి విస్తృత అల్పపీడన ప్రాంతాన్ని సృష్టిస్తుంది. దీనివల్ల వర్షాలు విస్తారంగా కురుస్తాయి. ఈ ద్రోణి కదలికను బట్టే వర్షాల గురించి ఐఎండీ అంచనాలను వెల్లడిస్తుంది. ఈ ద్రోణి నైరుతి రుతుపవన వర్షాలకు అత్యంత కీలకం.

ఈ ద్రోణి ఉత్తరానికి సుదూరంగా ఉంటే.. ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పటివరకు ఇదే పరిస్థితి నెలకొంది. దాంతో దిల్లీలో సోమవారం కూడా 43డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్థాన్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దాంతో ప్రజలు ఉక్కపోతను ఎదుర్కొంటున్నారు. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రుతుపవనాలకు అనుకూలంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ద్రోణితో పాటు రానున్న రోజుల్లో బంగాళఖాతంలో కూడా అల్పపీడన ప్రాంతం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తంగా వర్షాల కోసం దిల్లీ, ఉత్తర భారత ప్రజలు ఎదురుచూపులకు ముగింపు పడనున్నట్లు కనిపిస్తోంది.

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా చొరబాట్లు..

# అదేమిలేదన్న భారత సైన్యం

(మొదటి పేజీ తరువాయి)

సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది.

ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

# 58వేల భవనాలు ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. మరోవైపు, గల్లంతైన వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. సహాయక చర్యలపై ప్రభుత్వం వైపు నుంచి వస్తోన్న పరిమిత సమాచారం వారిలో అసహనాన్ని నింపుతోంది.

ఈ క్రమంలో వాట్సప్ ఒక అత్యవసర నెట్వర్క్గా మారింది. ఆసుపత్రిలో చేరినవారి వివరాలు, గల్లంతైన వ్యక్తులు, కూలిన భవనాలకు సంబంధించిన వివరాలను షేర్ చేస్తూ వాట్సప్ గ్రూప్‌లను ఒక రిజిస్ట్రీగా మార్చారు. ప్రభుత్వం వైపు నుంచి భారీ సమాచార లోటును ఈ గ్రూప్‌లు భర్తీ చేస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు.

# 13 మందిని కాపాడిన 'సునామీ'

(మొదటి పేజీ తరువాయి)

మంది జాడ తెలియట్లేదు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక సిబ్బంది ముమ్మరంగా అన్వేషిస్తున్నారు. ఈ సహాయక చర్యల్లో ఓ జాగిలం అసాధారణమైన సేవలు అందించి హీరోగా నిలిచింది. విపత్తు ప్రతిస్పందన బృందానికి చెందిన ఎనిమిదేళ్ల 'సునామీ' తన శిక్షకుడు జార్జ్ బీన్స్‌తో కలిసి 13 మందిని గుర్తించి వారి ప్రాణాలను నిలబెట్టగలిగింది.

ఒకప్పుడు కరకాస్ వీధుల్లో అనారోగ్యం, ఆకలితో అలమటించిన ఈ శునకాన్ని ఓ మహిళ చేరదీశారు. అనంతరం దాని తెలివితేటలు గమనించి విపత్తు ప్రతిస్పందన నిర్వహణ సంస్థలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. భవనాల శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించే నైపుణ్యంపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. 2023లో తుర్కియే, సిరియాల్లో సంభవించిన భూకంపం అనంతరం సహాయక చర్యల్లో.. వెనెజువెలాలో వరదల సమయాల్లోనూ కీలక పాత్ర పోషించింది.తాజాగా సంభవించిన భూకంపంలో కారాకస్‌లో 8 అంతస్థుల భవనం శిథిలాల కింద చిక్కుకున్న 60 ఏళ్ల వృద్ధుడిని 'సునామీ' గుర్తించడంతో రక్షణ బృందాలు విజయవంతంగా ఆ వ్యక్తిని బయటకు తీశాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారాయి. దీంతో సునామీ దేశవ్యాప్తంగా హీరోగా నిలిచింది.

# హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ విమానయానం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నాయని చెప్పారు.అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్‌లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు.

**మేడ్ ఇన్ తెలంగాణ:**

'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోందని మంత్రి పేర్కొన్నారు.స్పెయిన్‌కు ఐటీపీ ఏరో, కెనడాకు చెందిన ఎఫ్‌టీజీ ఏరోస్పేస్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు.తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్‌ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు.డీఆర్డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్ నగరానికి ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని మంత్రి తెలిపారు.తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు.

**చారిత్రాత్మక నిర్ణయం:**

రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌర-సైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు. తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలని ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి అన్నారు. తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలని, తెలంగాణ ప్రభుత్వం అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వమని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.'ఏరోమార్ట్ హైదరాబాద్-2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆలయాలకే భూమి హక్కులు

(మొదటి పేజీ తరువాయి)

సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపుపై స్పందిస్తూ.. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

అలాగే, ఆలయ పరిధిలో వివిధ మతాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇదిలాఉంటే, యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతల వారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు.

ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్ నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# సర్వర్ డౌన్.. సేవలు నిల్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా స్తంభించిపోయాయి.

అప్‌డేట్ చేసిన కొన్ని గంటల్లోనే సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు సైతం అనుకున్నంత స్థాయిలో పనిచేయడంలేదని తెలుస్తోంది. దీంతో భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

**మెరుగైన సౌకర్యాల సంగతి దేవుడెరుగు?.. కానీ??..**

సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్ చెల్లింపులు, ఈ-కేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఒక్కరోజేం కాదు?..

గత మూడు నెలల్లో పలు సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం.



# కొత్త సీఎస్ సంజయ్ జాజు బాధ్యతలు స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

**సీఎంను కలిసి సీఎస్ :**

కొత్తగా సీఎస్ బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈక్రమంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సీఎం అభినందనలు తెలిపారు.

# కేసీఆర్ అప్పులు కడుతూనే ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. రాష్ట్రంపై పడి వీరిద్దరూ కట్టుకథలు అల్లుతూ తిరుగుతున్నారని మండిపడ్డారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఇప్పుడు కాంగ్రెస్ పెట్టేది ఆశీర్వాద సభ కాదు క్షమాపణ సభ అనడం చూస్తుంటే.. అసలు ఆయన పదేళ్లు మంత్రిగా ఎలా పనిచేశాడో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రాన్ని దారుణంగా దోపిడీ చేసి, ఇప్పుడు ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పులు చేసి రైతులకు ఏం చేసిందో తాము లెక్కలు తీశామని, వారు పదేళ్ల పాలనలో కేవలం 2 లక్షల 88 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి దాన్ని పెద్ద గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంలోనే ఏకంగా 1 లక్ష 56 వేల కోట్లు ఖర్చు చేశామని, అయితే తాము చేసిన పనులను సరిగ్గా చెప్పుకోలేకపోతున్నామని భట్టి విక్రమార్క అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తాము ఇప్పుడు అసలు, వడ్డీలు కడుతున్నామని మండిపడ్డారు.

# ప్రత్యేక పోలీస్ మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలోని స్పెషల్ బెటాలియన్‌ల ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో డీజీపీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలు, పరిపాలనా సెక్షన్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఆయుధాల నిర్వహణ, సాంకేతిక విభాగాలు, నిర్మాణ పనులు, కార్యాలయ నిర్వహణ, ఇతర మౌలిక వసతులను డీజీపీ పరిశీలించారు. అనంతరం అధికారులు సమర్పించిన ప్రజెంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం డీజీపీ మాట్లాడుతూ బెటాలియన్‌లలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, వసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వాహనాల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి మెరుగైన నివాస క్వార్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాల కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**వెన్నుదన్ను:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లు నక్సల్స్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి ఎన్నో కీలక ఆపరేషన్లలో విశేష సేవలు అందించాయని డీజీపీ గుర్తు చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక బలగాలను అనుసంధానం చేయడం ద్వారా పోలీసు వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసిందన్నారు.

తాను నిజామాబాద్, వరంగల్ వంటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాల ఎస్పీగా పనిచేసిన సమయంలో ప్రత్యేక బలగాల సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు.

ఆ సమయంలో పోలీస్ స్టేషన్లపై తరచూ నక్సల్స్ దాడులు జరిగేవని, అలాంటి పరిస్థితుల్లో స్పెషల్ పోలీస్ బెటాలియన్లు అత్యంత ధైర్యసాహసాలతో విధులు నిర్వహించి నక్సల్స్ నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు.రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం 13 స్పెషల్ బెటాలియన్లను ఏర్పాటు చేసి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేసిందని తెలిపారు.

# రేపు.. కేబినెట్

(మొదటి పేజీ తరువాయి)

చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువాదంతో సహా బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఏ శాఖలోనైనా ఎలాంటి అజెండా అంశాలు లేకపోతే.. 'నిల్' రిపోర్టునైనా సరే నిర్ణీత సమయానికి సబ్మిట్ చేయాలన్నారు. మరోవైపు, సమావేశం జరిగే సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా గట్టి చర్యలు చేపట్టింది. కేబినెట్ భేటీ ముగిసే వరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులందరూ కచ్చితంగా తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. దీంతో పాటు ప్రొటోకాల్ డైరెక్టర్, హార్టికల్చర్ డైరెక్టర్, ట్రాన్స్‌లేషన్ డైరెక్టర్, యూనిట్ మేనేజర్లు సమావేశానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు.



# రైతు సం'క్షేమ'మే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తమ 30 నెలల కాంగ్రెస్ పాలనలో రైతు సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించామని, తాము సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచుతున్నామని ప్రకటించారు. ఈ క్రమంలోనే తొలి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్ల నిధులను ప్రభుత్వం నేరుగా జమ చేసిందని సీఎం వెల్లడించారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.

**బకాయిలు పెట్టిన బకాసురుడు:**

తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని సీఎం అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందన్నారు. ఒక్క కల్వకుంట్ల కుటుంబమే రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలో నిండా ముంచి, మన నెత్తిన మన్ను చల్లి వెళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అప్పులే కాదు, ఎన్నో తప్పులు కూడా చేశారని ఆరోపించారు. తాను బాధ్యతలు తీసుకున్నాక.. అసలు వివిధ శాఖలు, కార్పొరేషన్ల పేరుతో ఎన్ని రకాల అప్పులు ఉన్నాయో తేల్చాలని డిప్యూటీ సీఎం భట్టి ని కోరానని, తవ్వుతున్న కొద్దీ ఎక్కడికక్కడ చేసిన చేబదుళ్లు, కొత్త అప్పులు బయటపడుతున్నాయని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారని, వారు చేసిన అప్పు రూ.69 వేల కోట్లు మాత్రమేనని రేవంత్ తెలిపారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి , పాలమూరు బిడ్డ బూర్గుల రామక్రిష్ణారావు నుంచి కిరణ్ కుమార్ రెడ్డి వరకు తెలంగాణకు ఇచ్చిన అప్పు 69 వేల కోట్లు మాత్రేనన్నారు. అయితే తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ.8.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని తనకు అప్పగించారన్నారు. ఎన్నికల ముందు రూ.6 లక్షల కోట్లు అప్పు ఉందని తాము భావించామని, పదవి చేపట్టి లెక్కలు తీస్తే గుట్టల కొద్ది అప్పులు బయటపడ్డాయన్నారు.

**రంచన్‌గా జీతాలు:**

ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని సీఎం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు

**అసెంబ్లీ చర్చకు కేసీఆర్ సిద్ధమా?**

తమ ప్రభుత్వం సమాజంలో గౌరవం పెంచుకుంటూ వికాసం వైపు అడుగులు వేస్తోందని, రైతులకు అండగా నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రూ.20,677 కోట్ల రైతు రుణమాఫీ చేశామని, గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రైతు రాబందు (రైతు బంధు) పాత బకాయిలు రూ.7 వేల కోట్లను కూడా తామే చెల్లించామని చెప్పారు.

వడ్డ పైసలు కూడా సకాలంలో వేసింది తామేనన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా కింద రూ.27 వేల కోట్లు వేశామని, ఇప్పుడు మరో రూ.9 వేల కోట్లు వేస్తున్నామని.. ఈ విధంగా మొత్తం రూ.36 వేల కోట్లు రైతులకు అందించామని లెక్కలు చెప్పారు.రాష్ట్రంలో ఉచిత కరెంట్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎం స్పష్టం చేశారు. ఏ సన్నాసి అయినా ఉచిత కరెంట్ మాది అంటే మా అక్కలు చీపురుకట్టలతో కొడతారు. వాళ్ల తీరు చూస్తుంటే గుడ్డు వచ్చి కోడిని ఎక్కిరించినట్లు ఉంది. చెట్టులెక్క పెరిగితే సరిపోదు, ఆవగింజంత గుజ్జు ఉండాలి అంటూ బీఆర్‌ఎస్ నేతలపై పదునైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రైతుల సంక్షేమంపై అసెంబ్లీలో చర్చ పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాబోయే అసెంబ్లీ సమావేశాల చర్చకు కేసీఆర్ వస్తాడా? అంటూ సవాల్ విసిరారు.

**మెట్ట పంటలు వేయండి:**

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడతాయని, రైతులు వరి సాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి పంటల పెట్టుబడి కోసం మొదటి విడతలో 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482 కోట్లు రైతు భరోసా నిధులను శిల్పకళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. వ్యవసాయం అంటే దండగ కాదు, పండగ అనుకునేలా చేస్తున్నామని సీఎం తెలిపారు. 30 నెలలుగా రైతు సంక్షేమం కోసం కృషిచేస్తున్నామని వివరించారు. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నామన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలన్నీ మాఫీ చేశామన్న సీఎం, రుణమాఫీ కింద ఆర్నెళ్లలోనే రైతుల ఖాతాల్లో రూ.22,600 కోట్లు జమచేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదంటూ దుష్ప్రచారం చేశారని, సాగుకు ఉచిత కరెంట్ అనేది కాంగ్రెస్ పేటెంట్ హక్కని రేవంత్ రెడ్డి అన్నారు. ఉచిత కరెంట్‌ను 2004 లోనే వైఎస్‌ఆర్ మొదలు పెట్టారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం రూ.36 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. వ్యవసాయ పనిముట్ల కోసం ఏటా వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయిందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బోరు కింద పంట పండితే కూడా కాళేశ్వరం మహిమ అని మోసం చేశారని మండిపడ్డారు. కూలిన కాళేశ్వరం నుంచి మూడేళ్లుగా చుక్క నీరు కూడా తీసుకోలేదన్నారు. కాళేశ్వరం కూలినా ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారని సీఎం ప్రశ్నించారు. ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి, తాగుడు కల్చర్ తెచ్చారని విమర్శించారు. కేసీఆర్, మోదీ, కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదామని సవాల్ చేశారు. పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఇచ్చారా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బెంగాల్‌లో ఉడికిన పప్పులు తెలంగాణలో ఉడకవన్నారు. అక్కడ గెలిచేందుకు బీజేపీ 15 ఏళ్లు పట్టిందని తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడానికి మరో 15 ఏళ్లు పడుతుందన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చామన్న సీఎం, మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని మండిపడ్డారు. మహిళలతోనే సోలార్ విద్యుత్ ప్లాంట్ పెట్టించి వ్యాపారులుగా చేశామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వంలో ప్రతి శాఖలో కొలువులు భర్తీ చేశామన్నారు. కేసీఆర్ మళ్లీ వస్తే చేసేదేమీ ఉండదన్నారు.

కాళేశ్వరంపై కాశీ మజిలీ కథలు ఇంకెంత కాలం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీపై సెటైర్లు వేశారు. పదేళ్లు ప్రజలు నమ్మారని.. చివరకు బకాసురుడిని బంధించి ఫామ్హౌస్లో పెట్టారంటూ ఛలోక్తులు విసిరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నష్టాల్లో కొట్టుమిట్టాడిన ఆర్టీసీ నేడు వెయ్యి కోట్ల లాభంతో నడుస్తోందని అన్నారు. సింగరేణి, విద్యుత్ శాఖలో భారీ సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్, 12 ఏళ్ల మోదీ పాలనతో పాటు రెండున్నరేళ్ల తమ పాలనపై అసెంబ్లీలో చర్చ పెడదామని విపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సంచలన సవాల్ విసిరారు.

**15ఏళ్లు పట్టింది:**

బెంగాల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి 15 ఏళ్లు పట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అక్కడ మమత కాబట్టి ఊరుకున్నారు.. ఇక్కడ మా వాళ్లు గట్టి సమాధానమే చెబుతారంటూ బీజేపీకి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తాను ఉన్నది ఉన్నట్లుగా చెబుతానని, పదవి శాశ్వతం కాదన్నారు. ఇందిరమ్మ, ఎన్టీఆర్లకే పదవులు శాశ్వతం కాదు.. అబద్దాలు చెప్పి నమ్మించను, ఉన్నదే చెబుతానని సీఎం అన్నారు. ఈ ఏడు వర్షాలు ఉండవని నిపుణులు చెబుతున్నారని, వర్షాలు పడకపోతే ఇబ్బంది ఉంటుందని, అందుకే పంటలను మార్చమని చెబుతున్నాయని తెలిపారు. పంట మార్పిడి చేయమంటే దానిపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సమన్వయంతో.. ఆపరేషన్ ముస్కాన్

## ముస్కాన్ పోస్టర్ ఆవిష్కరించిన డీజీ చారు సిన్హాం

## ఈనెల 1నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్




**హైదరాబాద్, జూన్ 30(మనం, ప్రత్యేక ప్రతినిధి):** ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని డీజీ చారు సిన్హా పేర్కొన్నారు. తెలంగాణ పోలీసుల మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో ఆమె మంగళవారం ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.నెల రోజుల పాటు చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి వ్యూహరచన, అమలు కార్యాచరణను ఖరారు చేయడానికి వివిధ శాఖల అధికారులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్లు, వివిధ ప్రభుత్వ శాఖలు, కీలక భాగస్వామ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డీజీ చారు సిన్హా మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌లో గల్లంతైన చిన్నారుల అన్వేషణను వ్యవస్థీకృతంగా చేపట్టడం, బాలల దోపిడీకి పాల్పడుతున్న పునరావృత నేరస్థులు, యజమానులను గుర్తించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026 జూలై 1 నుండి జూలై 31 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గల్లంతైన చిన్నారులను గుర్తించడం, బాల కార్మికులు,బానిస కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను రక్షించడం, వారికి తగిన రక్షణ, పునరావాసం, సమాజంలో తిరిగి కలిసేలా చర్యలు చేపట్టడమే ప్రధాన లక్ష్యమన్నారు. స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్లు , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు , ఉపవిభాగ స్థాయి ఆపరేషన్ ముస్కాన్ బృందాలు, జిల్లా బాలల సంరక్షణ అధికారులు, బాలల సంక్షేమ,సంరక్షణ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాయన్నారు. ప్రతి చిన్నారిని రక్షించి, వారికి దీర్ఘకాలిక పునరావాసం కల్పించడంలో శాఖల మధ్య సమన్వయం కీలకమని ఆమె స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహిళా భద్రత విభాగం డీఐజీ పరిమళ హనా నూతన్, ఎస్పీ ఎస్. మల్లారెడ్డి మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌కు భారీ ఊరట

## కేసును కొట్టివేసిన నాంపల్లి ప్రత్యేక కోర్టు



**హైదరాబాద్, జూన్ 30, (మనం ప్రతినిధి):** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌కు నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. 2022 నాటి కేసులో.. హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్పందించిన మంగళహట్ పోలీసులు ఆయనపై 153ఎ, 295ఎ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

అయితే, 2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఎ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

# హెచ్‌సీయూలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె

- **తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదే లేదని అల్టిమేటం**

**హైదరాబాద్, జూన్ 30 (మనం ప్రతినిధి):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మె భాట పట్టారు. తమ డిమాండ్ల సాధనకై కార్మికులంతా మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఎళ్లుగా పరిష్కారం కానీ, దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం ఎదుట మరోసారి నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాల వల్ల తాము తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల అమలుతో తమకు ఉద్యోగ భద్రత కరువైందని, కార్యాలయంలో రక్షణలు బలహీనపడ్డాయని కాంట్రాక్ట్ కార్మికులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా తాము పోరాడి సాధించుకున్న ప్రాథమిక కార్మిక హక్కులను సైతం ఈ కొత్త చట్టాల సాకుతో అణచివేస్తున్నారని.. వర్సిటీలో కొత్త కాంట్రాక్టర్ తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉంటే, ఇటీవలే వర్సిటీకి వచ్చిన కొత్త కాంట్రాక్టర్ నియామకంతో పరిస్థితి మరింత కష్టంగా మారిందని వాపోతున్న కార్మిక సంఘాల నాయకులు కొత్త కాంట్రాక్టర్ ఈ కార్మిక చట్టాల నిబంధనలను ఆసరాగా చేసుకుని, మాకున్న పాత హక్కులను, ప్రయోజనాలను పూర్తిగా రద్దు చేశారని ఆరోపించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదే లేదని అల్టిమేటం జారీ చేశారు. వర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించి, తమతో చర్చలు జరపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# 8వ వేతన సంఘం ప్రక్రియలో కీలక ముందడుగు

- **జూన్ 30 లోగా ఆన్‌లైన్‌లోనే డేటా సమర్పించాలని ఆదేశం**
- **కేంద్ర ప్రభుత్వశాఖలకు 8వపే కమిషన్ డెడ్‌లైన్**




**హైదరాబాద్, జూన్ 30, మనం ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి 8వ వేతన సంఘం తన కార్యకలాపాలను కీలక దశకు చేర్చింది. ఉద్యోగుల జీతాలు, అలవెన్సులపై సిఫార్సులు చేసేందుకు ముందుగా.. ప్రభుత్వం ప్రస్తుతం ఎంత ఖర్చు చేస్తోందో స్పష్టమైన అంచనాకు రావాలని కమిషన్ భావిస్తోంది.

ఇందులో భాగంగా అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థలు తమ ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన పూర్తి వివరాలను కమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆన్‌లైన్ డేటా పోర్టల్‌లో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

అయితే, ఖచ్చితంగా తమ సమాచారాన్ని అప్ లోడ్ చేయడానికి జూన్ 30 తుది గడువుగా నిర్ణయించినట్లు 8వ పే కమిషన్ అప్ డేట్‌ను పంచుకునే ఒక పోర్టల్ పేర్కొంది. ఈ ప్రక్రియలో వందలాది ప్రభుత్వ కార్యాలయాలు, భారీ ఆర్థిక డేటా ఇమిడి ఉన్నందున, అన్ని సంస్థలు గడువులోగా ఈ పని పూర్తి చేస్తాయా? లేదా? కమిషన్ మరింత సమయం ఇస్తుందా అనేది వేచి చూడాలి.

### ఆన్‌లైన్‌లోనే సమర్పించాలి?..

సమాచారమంతా తప్పనిసరిగా తమ అధికారిక ఆన్‌లైన్ డేటా పోర్టల్ ద్వారానే సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్ పద్ధతిలో ఎలాంటి వివరాలను స్వీకరించబోమని స్పష్టం చేసింది. అంటే.. మంత్రిత్వ శాఖలు భౌతిక ఫైళ్ళు, ఎక్సెల్ షీట్లు, ప్రింటెడ్ డాక్యుమెంట్లు లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపడానికి వీల్లేదు. కేవలం ఆన్లైన్ పోర్టల్లో అప్లోడ్ చేసిన డేటాను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. సిఫార్సుల రూపకల్పన కోసం ఒకే డిజిటల్ డేటాబేస్ను రూపొందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### సమర్పించాల్సిన వివరాలు ఇవే..

నివేదికల ప్రకారం.. గత మూడు పూర్తి ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వ్యయ వివరాలను అందించాలని కమిషన్ కోరింది. 2022-23, 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో ఉద్యోగుల జీతభత్యాలపై అయిన ఖర్చు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. పే మ్యాట్రిక్స్ లెవల్ 1 నుంచి లెవల్ 18 వరకు అన్ని స్థాయిలలో జీతాలు, వివిధ రకాల అలవెన్సులపై ఎంత ఖర్చు చేశారో విడివిడిగా చూపించాలన్నారు. కేవలం మూల వేతనం మాత్రమే కాకుండా ప్రతి అంశానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను కమిషన్ కోరింది. ఇందులో బేసిక్ పే, మిలిటరీ సర్వీస్ పే, కరవు భత్యం (డీఏ), ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ), రవాణా భత్యం (టీపీటీఏ), రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, రైల్వే ఉద్యోగులకు రన్నింగ్ స్టాఫ్ అలవెన్సులు, నాన్-ప్రాక్టీసింగ్ అలవెన్స్ (ఎన్పీఏ) వంటి అన్ని వివరాలు ఉండాలి. వీటికి తోడు ఉద్యోగులకు చెల్లించే ఇతర అలవెన్సుల వివరాలను కూడా పొందుపరచాలి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో అలవెన్సులపై అయిన మొత్తం ఖర్చును కూడా నివేదించాల్సి ఉంటుందన్నారు.

### డేటా సేకరణ ఎందుకంటే?..

వేతన సంఘం తన సిఫార్సుల రూపకల్పనకు ముందు చేపట్టే అతి ముఖ్యమైన చర్యలలో ఈ డేటా సేకరణ ఒకటి. ప్రస్తుతం వివిధ పే లెవల్స్‌లో జీతభత్యాలపై ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో అధ్యయనం చేయడం ద్వారా, భవిష్యత్తులో చేసే సవరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక ప్రభావాన్ని కమిషన్ కచ్చితంగా అంచనా వేయగలదు. సవరించిన పే స్కేల్స్, అలవెన్సులు, ప్రభుత్వ మొత్తం వ్యయం, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై పటిష్టమైన సిఫార్సులు చేయడానికి ఈ సమాచారం దోహదపడుతుంది. ఈ డేటా సేకరణ పూర్తయ్యాక, కమిషన్ గణాంకాలను విశ్లేషించి, నివేదిక రూపకల్పనలో తదుపరి దశకు వెళ్లే అవకాశం ఉంది.

# అది సామూహిక హత్య

- **సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేయాలి?..**
- **బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాల్సిందే? హరీశ్‌రావు డిమాండ్**



**హైదరాబాద్, జూన్ 30 (మనం ప్రతినిధి) :** తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు.

ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని హితవు పలికారు.

రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమంటూ హరీశ్ తనదైన శైలీలో తీవ్రంగా మండిపడ్డారు.

ఈ ఘటన సామూహిక హత్య అని, 818 హెచ్‌పీ అనుమతి తీసుకుని 1777 హెచ్‌పి నడపడం, సేఫ్టీ గార్డ్స్ ఫైర్ ఎన్ఓసీ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

# దుర్గమ్మ సేవలో చత్తీస్‌గడ్ డిప్యూటీ సీఎం



**విజయవాడ ఇంద్రకీలాద్రి చివరి 30(మనం న్యూస్):** ఛత్తీస్‌గడ్‌రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నగర పర్యటనలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు శంకర్ శాండిల్య, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు అవురు శ్రీనివాసరావు ఉపముఖ్య మంత్రికి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు.

# ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన ఏపీ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్

## జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టుల ఏర్పాటుకు వినతి



**అమరావతి, జూన్ 30,(మనం ప్రత్యేక ప్రతినిధి):** జిల్లాల పునర్విభజన తర్వాత తలెత్తిన సాంకేతిక పరమైన ఇబ్బందులను పరిష్కరించాలని, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలని ఏపీ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో ఏపీ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎంను కలిసి వివిధ అంశాలను వివరించారు. జ్యూడిషియల్ అధికారుల సమస్యలు, సంక్షేమం సహా అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. జ్యూడిషియల్ అధికారుల కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ వైద్య చికిత్స సౌకర్యాన్ని కల్పించటంతో పాటు సాఫ్ట్ లోన్ పరిమితిని కూడా పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. అలాగే ఇంటి స్థలాలను కూడా కేటాయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారు. కొత్త కోర్టుల ఏర్పాటు, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన వంటి అంశాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాలన్నిటినీ దశలవారీగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని సీఎం అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఏపీ జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.చక్రపాణి, ఉపాధ్యక్షులు జె. శ్రీనివాసరావు, కె.శైలజ, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యుల వెన్నెల, రాధారాణి ముఖ్యమంత్రిని కలిశారు.

## వాహనంపై శ్రీ కోదండరాముడి అలంకారంలో

# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

## రామనామ స్మరణల మధ్య భక్తులను కటాక్షించిన కలియుగ ప్రత్యక్ష దైవం

## అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక వైభవం



**తిరుపతి జూన్ 30 మనం న్యూస్:** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు హనుమంత వాహనంపై శ్రీ కోదండరామ అలంకారంలో దివ్యమంగళ విహారం చేస్తూ భక్తులకు అభయప్రదానమిచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ, శ్రీరామ నామస్మరణల మధ్య స్వామివారి దివ్యరూపాన్ని దర్శించుకుని పులకించిపోయారు. హనుమంతునిపై శ్రీ కోదండరాముని అలంకారంలో స్వామివారి దర్శనం భక్తులకు అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది.

మధ్యాహ్నం 3.00 నుంచి 4.00 గంటల వరకు పుణ్యాహవాచనం, వసంతోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు గజవాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మీరు ఎప్పటికీ రైతు ద్రోహివే?

## అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నరు?

## సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్, జూన్ 30, (మనం ప్రతినిధి):** మీరేన్ని తియ్యటి మాటలుజెప్పిన, మాయలుజేసిన సరే? మీరు ఎప్పటికీ రైతు ద్రోహివే?..నిజమైన అసలు రైతు బాంధవుడు కేసీఆరే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మంగళవారం మరోసారి విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల సందర్భంగా ప్రభుత్వంపై ఆయన తనదైన శైలీలో సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 30 నెలల ముదనష్టపు పాలలలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారన్నారు. పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఏకంగా నాలుగు సార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది.

'మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. మీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావన్నారు.

72 సార్లు.. ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## వానా! వానా!

వానా! వానా! విన్నావా
నిన్ను తొలిసారిగా
దేవుని చేసింది మా'రైతే!

నీవు ఎన్నిసార్లు నమ్మించి
తడి లేని గుడ్డతో గొంతు గోసినా
నీతో జూదమాడుతున్నది ఆరైతే!

దుక్కి దున్నిన రైతు చూపు
నిత్యం ఆశతో ఆకాశం వైపు
చినుకు రాల్చవు చింత బాపవు!

ఆ నల్ల మేఘాలు
ఎల్లకాలం నిన్నూరేగించలేవు
అదను తప్పొస్తే విలువేముంటది?!

పండిన పంటను సైతం
వరదై ఎత్తుకెళ్లావు
ప్రాయశ్చితానికి నీకిదే అవకాశం!

నీవు కురవందే
ఈ నేలతల్లి మురవదు
రైతు కంట ఆశలు మెరువవు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

## చాలదూ?

నా ఒంట్లోకెక్కిన ప్రాణం
మా నాన్నదే
అది చాలదూ?

నా ఒంట్లో ప్రవహించే రక్తం
మా నాన్నదే
అది చాలదూ?

నా ఎదుగుదలంతా
మా నాన్న
చెమటచుక్కల చలువే
అది చాలదూ?

ఇంకేం సంపాదించాలి?
మానాన్న
నన్ను సంపాదించాడు
అది చాలదూ?

## బ్రెవిటీలు

ఆనందాల్ని ఖర్చుపెట్టి
కన్నీళ్లు పోగేసుకుంటాడు
నాన్నెప్పుడూ అంతే

అమ్మ సూదీదారమై
చిన్న చిరుగును కూడా
కనిపించనిచ్చేది కాదు

పిల్లల దుస్తులకోసం
నాన్నదెప్పుడూ
చిరుగుల బనీనే

నాన్న పాత కళ్లజోడు
ఎవరికీ మనసు రావటం లేదు
మారుద్దామంటే

చుక్కల ఆకాశం
నాన్న చిరుగుల బనీను
ఏటేటా ఓ చుక్క పెరిగేది

చుక్కంత చిరుగు
చందమామైంది
సూదీదారం దొరక్క

పెద్ద పెద్ద మాసికలు -
చిన్న కుట్టు కూడా
నామేషే ఇప్పుడు

**- చిత్తలూరి**
9133832246

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/** వెబ్‌సైట్‌లో చూడండి
**- ఎడిటర్**

# ఇడుపుకాయితంపై ఇకమతులెందుకు...!



'తమలపాకుతో తానొకటిస్తే, తలుపు చెక్కతో నేరొండిస్తా! అన్నట్టుగా గీ దినాంలల్ల తగాదాలు సురువైతున్నయ్. సుట్టాలు,పక్కాలు,దగ్గరోల్లు, దూరపోల్లు అనే ముచ్చటలేదు. అయ్యవ్వలు, అన్న దమ్ములు,బావ,బామ్మర్దులు అనేలెక్క లేదు. ఇయ్యాల్రేపు కొత్తల సుట్టాలేగాని, తుర్తిగ మాట్లాడే సుట్టరి కాలు మచ్చుగ్గూడ అగుపిత్తలేవు. యేడ్నన్న సుక్కలూడివడ్డట్టు ఆడోటిఆడోటి ఉండొచ్చు. గసొంటోల్లకు రొండుసేతుల దండం బెట్టాలే. బూంలు పెంచుకునే కాడ బుత్తాంత తక్వొందని పంచాతివెట్టుకొని, పజీత దీసుకొని సంపుకున్న తరీకలను జూత్తన్నం. పోరడు నచ్చలేదని లగ్గమైనంక అని బత్కును బర్బాద్ జేసి కతంజేసే కతలు జూత్తన్నం. గింతనన్న ఓర్సు కునుడు లేక ఇంటిల్లిపాది జీవిడుసుడు జూత్తన్నం. 'కర్ర పచ్చు వడితే కన్నెర్ర వడ్డదనే' ముచ్చట యెరికున్నదేనాయే. మన్నాన పక్కోడు(మనోడైన)మంచిగ బత్తండంటే, ఆన్నెట్టాగైన కింది గ్గుంజాలని జూసేటోల్లు సెలగ మంది ఉంటరు. ఒగలంటే, ఒగలకు పడకుండ,ఆల్ల కాల్లల్ల కట్టెలువెడ్తనే ఉంటరు. గ ఎవుసం జేసేటోల్లైనా, బేపారత్తులైన, కూలోల్లు,నాలోల్లైనా, సైన్మ లోల్లైనా, రాజిర్కంలనైనా గిది గిట్ల నడుత్తనే ఉంటది. గిదీంట్ల గమ్మత్తేందంటే యెవన్నైతే కొట్టాలని, తిట్టాలని సూత్తమో ఆల్లు మనకంటే బుత్తాంత బలమున్నోల్లనుకుంటే, మనకు సాత గాక పోతే కుక్కమీన, నక్కమీన, పోలగాండ్లమీన వెట్టి తిట్లు, శాపనా ర్థాలు వెడ్తం. గట్ల దమ్మచ్చేదాంక తిడ్తేగాని మనకు తుర్తిగాదు.

గిట్ల తిట్టుకోనీకి సుట్టాలే గాదు ముక్కుమొకం తెల్వ నోల్లైనా,జాయి జాతుల పంచాతిగాకున్న, సిన్న సందు దొర్కితే సాలు, సివసత్తుల్లెక్క ఊగుడే, యెదుటోల్లను కడుగుడే! గీ నడ్మ మన్నాన లొల్లిలొల్లైతన్న ముచ్చట మనం పొద్దుగాలచ్చేపేపర్లల్ల, బొమ్మల పెట్టెలల్ల ఇంటన్నం, సూత్తన్నం. గదే గా 'ఇడుపు కాయితం' పేర్మీన సైన్మా తీత్తన్న ముచ్చట. యెవరు మొదలువెట్టిండ్లో గానీ రచ్చరచ్చైతంది. యెవ్వలకు నచ్చినట్లు ఆల్లుంటలు.

నా లెక్క నువ్వుండవు నీ లెక్క నేనుండను గదా! 'కాకి పిల్ల కాకికి ముద్దు' నే ముచ్చట యెర్కేనాయే!!యే జాగల ఉండేటోల్లు ఆ జాగల నడ్తన్న(వ్యవహార) మాటలు, పండుగలు పబ్బాలంటే ఆల్లకు మత్తు(స్తు)పాయిరంగద. ఉంకో జాగల ఉండే టోల్లకు సుతరాము పడక పోవచ్చు. అయితే ఆల్ల ముచ్చట్లను, పండుగలను ఎక్కిరిత్తవా? గయిటిని,తక్వ జేత్తవా? అవ్వబాసను మర్సిపోయేటోడు రేపురేపు అవ్వను సుత మర్సిపోతడేమో గదా! ఇయ్యాల్ల రొండు తెల్గు రాట్టాలల్ల లెక్కలేనన్ని తరీకల ముచ్చట్లుం టయ్. కంసేకం ఎన్మిది, తొమ్మిది మొబైల్ల దూరంకు యాస, బాసలతోటి సాయితగా మాండలికాలు సుత మారుత యని బాస మీన పట్టున్నోల్లు సెప్తాండ్లు.

బాసకు జరంత సింగారాన్ని, బుత్తాంత సోకును తీసు కచ్చేటియి, ఆల్లతాన బాసల ఉన్న మాండలికాలే అనేటిది, అందరంటున్న ముచ్చట. గిదీంట్ల యేరే తరీక ముచ్చట్లుండయి.






మాండలికం,సామెతలు బాసకు నగల సొంటియి. నగలేసుకున్న ఆడోల్లు యెంత సక్కదనంగుంటలు. నగలు పెయ్ మీన యెయ్య నోల్లెట్లుంటలు. గట్లనే తెలంగాణ బాసల 'ఇడుపు కాయితం' అనేది మాండలికం.గిది పిల్ల,పిలగానోల్లిద్దరికి ఇలువైన ముచ్చటనే.

ఇగ పెండ్లాం, మొగుల్లు కల్సి బత్కలమనుకున్న పుడు, యెవలకాల్లు యేరుగా బత్కనీకి ఇట్టపడి, పెద్దమనుసులల్ల, (పంచాదిల) రాసుకొనే కాయితం.గిట్లయితే కొంత ఇలువుం టదని రాసుకునుడు.యెన్కట కచ్చీర్లకు వోతే ఆల్లను ఊల్లల్ల ఒ లెక్కన జూసేటోల్లు. 'ఇడుపు కాయితం' మాట మాతాన అందరు, అల్కగ మాట్లాడుకునేదే. గి దీన్ని కారెడ్డంగా మాట్లాడుడు, యికయికలు పకపకలాడుడు అంటే తెలంగాన బాస,యాసల ఇలువను తక్వజేసుడే గదా! గీ సైన్మ పేరును చిన్నతనంగా జేత్తే మేం మీ మిరపకాయ్, జిలేబి గులాబిలను యెక్కిరియ్యలేమా? గది మాకు మంచిగని పియ్యది.

గట్లగాదుగని, మా నీల్లు, మేం గట్టిన పన్నులు, మా నౌకర్లు మాకత్తలేయనే గదా! గట్లనే మా బాస,మాయాసలను మీ సైన్మా లల్ల బుడ్డర్ఖాన్లకు,రౌడీలకు వెట్టి సిన్నబుచ్చుతండ్లనే గదా! మేం యేరువడేందుకు లొల్లి జేసింది. యేల(వేల) కానంగ మా పోరలు జీవిడిసింది గందుకనే గదా. దేసాన్ని యేలేటోల్లు మీకు మాకు 'ఇడుపుకాయితాన్ని' రాసింది. గెట్టు వెట్టింది. 12యేండ్ల సంది యెవలకాల్లే బత్కుతన్నం,యెవలజాగల ఆల్లమే ఉంటన్నం. మల్ల గిదేం రోగం, గింత ఓర్వలేని తనమెందుకు? గీ మాట మీకు మంచిగనిపియ్య లేదనుకుంటే, యెట్లుంటే మంచిదో ఉపాయం చెప్పాలే. రొండున్నర జిల్లాల మీతెల్గుకు రోగమచ్చిందనే (తెగులు) మా కాలోజి, జయశంకరులు గట్టిగ చెప్పిండ్రు. గట్లనే మా'ఎచ్చమ్మ(పాకాల యశోద రెడ్డి) మా తెలుగు మాట అచ్చపు మాట, మురిపాల మూట, మల్లెపూల తోట, సింగారాల గురిగి, ఒంపుసొంపుల ఊట' అని అందరితో అనిపిచ్చిండ్రు.. మా సామల సదాసివ సారయితే ఏకంగ యెవని తెలుగు?యెక్కడి తెలుగు? మీది మీకింపు. మాది మాకు సొంపు అన్నడు గదా!

ఐనా ఇడుపు కాయితం ముచ్చట మీకుదెల్వక పోతే మీ తాన సానా మంది పెద్ద పెద్దోల్లున్నలు కదా! ఆల్లనడుగండ్రీ!! బెహ త్తరీన్‌గా సెప్తరు. తెల్గు సైన్మావోల్లైన,అరవ తంబీలైన, ఇందీ సైన్మావోల్లైనా సానా మంచిగ జెప్తరు. యెందుకంటే ఒక్కొక్కలు రొండు మూడు మాట్ల యిడుపుకాయితం యిచ్చి నోల్లున్నలు. మా మీన యేడ్సుడుకంటే గసొంటోల్లను అడుగుండ్రీ.

ఇంక అంగట్ల దున్నపోతుల్లెక్క బేరం బెట్టి పూటకో పాల్టీ కీ యిడుపు కాయితమిచ్చి యేరే లగ్గం (పాల్టిల సెరీక)జేసుకునే ఆయారాం గయారాం గాల్లనగుండ్రీ యిడుపుకాయితం ముచ్చట్లు మస్తుగ సెప్తరు. గుప్పుడైతే అమ్ముడువోయే మన యేలి కలను జూసి అంగట్ల పస్రాలు సుత నవ్వుకుంటన్నయ్. యెందు కంటే అవి యెవలన్న తోల్కత్తనే అత్తయి. కని గుప్పుడు మన నేతి బీర్కాయ నేతల్ సిగ్గు,స(శ)రం అన్నీ ఇడిసి వెట్టినోల్లు గదా! బాజాప్త అమ్ముడువోతండ్లు.

మీరు మాట్లాడే గిసొంటి మాటలు తెలంగానల మనుషులను మొండిపట్టువట్టేటట్టు జేత్తయి. ఇప్పటి కత్తు పోరలు గిసొంటా టిని సయించరు సుమా! మాతాన సుత కోడిగుడ్డు మీన ఈకలు పీకే నేతల్లున్నలు.

జనాల్ని రెచ్చగొట్టి ఎలచ్చన్ల పబ్బం గడుపనీకి సూసేటోల్లు సుత మస్త్ మంది ఉన్నరు. గిసొంటోల్లతోనే ఇప్పటికే సానా నట్టపోయినం.ఇడుపు కాయితం తీసుకున్నం. యెవ్వల బాస, యాసలనైనా యెక్కిరించ కుండ, కారెడ్డమాడకుండ ఒకలకొకలం ఇలువ యిచ్చుకుందాం.అన్నదమ్మల్లెక్క కలిసుందాం. యెవ్వలకెవలు తక్వకారు.

యెవ్వలకెవలు తీసిపోరు.సొంత బాస కోసం,యాస కోసం, సొంతంగా యేలుకోవటంకోసం అరువైయేండ్లు కొట్లాడి,పానా లిచ్చి గెల్సినోల్లం. మాబాస,మా ఆట పాటల్నే బానాల్లెక్క ఆ(వా)డుకున్నోల్లం. మేం మట్టి ముద్దలం కాదు, లబ్బరు సెండి అసొంటోల్లం. జెప్పన మీదికెగురుతం.మీరు మమ్ములను ఇలువ తక్వ జేసుకుంట రెచ్చగొట్టినట్టు మాట్లాడితే, దాని లెక్క యెంటనే ముట్టజెప్తం. మాకు సుత కొట్లాడుడు కొత్తగాదు. గందుకని యెవలతాన ఆల్లమే ఉందం. మా జోలికి రాకుండ్లీ.. మీ పజీత తీసుకోకుండ్లీ... సెనార్తులు

**- మీస రాజమల్లయ్య**
9491319904

# 'వైద్యో నారాయణో హరి?'



భారతీయ సంస్కృతిలో వైద్యుని స్థానం చాలా ఉన్నతమైనది. శారీరక, మానసిక వేదనలతో అల్లాడిపోయే రోగికి ఆఖరి నిమిషంలో ఆశాకిరణంలా కనిపించేది వైద్యుడే. ఒకప్పుడు కేవలం సేవా దృక్పథంతో, మానవతా విలువల పునాదులపై నిలిచి నడిచిన ఈ వృత్తి, కాలక్రమేణా ఆధునిక సమాజంలో తీవ్రమైన మార్పులకు లోనైంది. నాడు డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ వంటి మహనీయులు చూపిన మార్గానికి, నేటి కార్పొరేట్ యుగపు ధోరణులకు మధ్య కొండంత వ్యత్యాసం కనిపిస్తోంది. 'వైద్యో నారాయణో హరి' అంటూ డాక్టర్లను దేవుడితో పోల్చిన సమాజం మనది. నాటి డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ కాలంలో వైద్యమంటే ఒక తపస్సు. అదొక సేవ, సమాజ హితం కోసం సాగిన యజ్ఞం. కానీ, నేటి సమకాలీన సమాజంలో ఆ పవిత్ర భావన రూపాంతరం చెందింది. నేడు వైద్యరంగం సాంకేతికంగా రోబోల స్థాయికి చేరినా.. నైతికంగా మాత్రం ఎక్కడో పాతాళానికి పడిపోతోందనే చేదు నిజం మన కళ్లముందే కదలాడుతోంది. ఈనాటి ఆధునిక వైద్య పోకడలను గమనిస్తే, మానవత్వం కంటే ఎక్కువగా వ్యాపార సూత్రాలే రాజ్యమేలుతున్నట్లు స్పష్టమవుతోంది.

ప్రస్తుత వైద్య వ్యవస్థలో పాజిటివ్ కోణాన్ని చూస్తే.. నాణ్యమైన చికిత్స అందుబాటులోకి రావడం అతిపెద్ద మార్పు. ఒకప్పుడు ప్రాణాంతకమైన వ్యాధులకు నేడు అత్యాధునిక శస్త్రచికిత్సలు, రోబోటిక్ సర్జరీలు, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యాధి నిర్ధారణలు ప్రాణం పోస్తున్నాయి. దీని వెనుక నిరంతరం శ్రమిస్తూ, తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసే నిబద్ధత గల వైద్యులు నేటికీ ఉన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో వేల సంఖ్యలో వచ్చే రోగులను ఓపిగ్గా చూసే వైద్యులు, అర్ధరాత్రి అత్యవసర పరిస్థితుల్లో బెడ్ల వద్దే ఉండి ప్రాణాలు కాపాడే ప్రాణదాతలు ఈ సమాజానికి వెన్నుముక. కార్పొరేట్ శకంలోనూ రూపాయి ఆశించకుండా సేవా భావంతో పనిచేసే కొందరు వైద్యుల వల్లే ఈ వృత్తికి ఇంకా కాస్తో కూస్తో గౌరవం మిగిలి ఉంది.

కానీ,ఈ నాణేనికి మరో వైపున్న రూపం అత్యంత భయానకమైనది.. ఆందోళనకరమైనది. నేడు వైద్యం అనేది 'సేవ' అనే ముసుగు తీసేసి పూర్తిస్థాయి 'కార్పొరేట్ వ్యాపారం'గా అవతరించింది. ఒక సామాన్యుడు ఆసుపత్రి మెట్లు ఎక్కాలంటేనే గుండె గుభేలుమనే పరిస్థితి నెలకొంది. వైద్య విద్యను కోట్లాది రూపాయల డొనేషన్లు పోసి కొనాల్సిన దౌర్భాగ్యం ఏర్పడ్డాక, ఆ చదువు పూర్తి చేసుకుని వచ్చే కొందరు డాక్టర్లలో సేవాభావం ఆశించడం అత్యాశే అవుతుంది. పెట్టిన పెట్టుబడిని వడ్డీతో సహా వీలైనంత త్వరగా రాబట్టాలనే కక్కుర్తి కొందరు వైద్యులను పట్టిపీడిస్తోంది. దీనికి తోడు కార్పొరేట్ ఆసుపత్రులు విధించే నెలవారీ టార్గెట్లు, కమీషన్ల సంస్కృతి ఈ వృత్తిని మరింత దిగజార్చుతున్నాయి.



చిన్న తలనొప్పికి వస్తే వేలాది రూపాయల స్కాన్లు రాయడం, చిన్న జ్వరానికే ఐసీయూలో పెట్టడం, అవసరం లేకపోయినా యాంటీబయాటిక్స్ గుప్పించడం.. సహజ ప్రసవాలు దాదాపు మృగ్యమైపోయి ప్రతిదానికీ సిజేరియన్ కత్తులు దూయడం నేటి నిత్యసత్యాలు. రోగి ప్రాణం కంటే వారి జేబు పరిమాణమే ఇక్కడ ముఖ్యం అవుతోంది. డాక్టర్లకు, ఫార్మా కంపెనీలకు, ల్యాబ్‌లకు మధ్య ఉన్న అపవిత్ర బంధం సామాన్యుడి రక్తాన్ని పిండుతోంది. చివరకు ప్రాణం పోయాక కూడా శవాన్ని బెంచ్‌పై ఉంచి బిల్లులు వసూలు చేసే అమానుష పోకడలు 'వైద్యో నారాయణో హరి' అనే సూక్తిని వెక్కిరిస్తున్నాయి. రోగితో మాట్లాడి, వారి బాధను విని ఓదార్చే కనీస మానవత్వాన్ని నేటి డాక్టర్లు కోల్పోతున్నారు.. కేవలం రిపోర్టులను చూసి ప్రిస్క్రిప్షన్లు విసర్జించే యంత్రాలుగా మారిపోతున్నారు. ఈ నెగిటివ్ ధోరణుల ప్రభావం సమాజంలో తీవ్రమైన ఎదురుదెబ్బలకు దారితీస్తోంది.

వైద్యులపై నమ్మకం సన్నగిల్లడంతో, చికిత్స విఫలమైనప్పుడు ఆసుపత్రులపై దాడులు చేయడం, డాక్టర్లను భౌతికంగా హింసించడం వంటి వికృత చేష్టలు పెరుగుతున్నాయి. ఇది మరో ప్రమాదకరమైన ధోరణి. ఈ భయం వల్ల నిజాయితీ గల వైద్యులు కూడా అత్యవసర సమయాల్లో 'రిస్క్' తీసుకోవడానికి వెనుకాడి, రోగులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ కాలయాపన చేస్తున్నారు. ఫలితంగా అమాయక ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి.

వైద్యరంగం బాగుపడాలంటే కేవలం డాక్టర్లను తప్పుబడితే సరిపోదు. మూలాల్లో ఉన్న లోపాలను సరిదిద్దాలి. వైద్య విద్య సామాన్యుడికి అందుబాటులో ఉండాలి, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీపై ప్రభుత్వాల నియంత్రణ ఉండాలి. వైద్యులు తమ తెల్లకోటుపై పడుతున్న వ్యాపారపు మచ్చను తుడిచేసుకోవడానికి ఆత్మపరిశీలన చేసుకోవాలి.

జూలై 1న కేవలం శాలువాలు కప్పుకొని శుభాకాంక్షలు చెప్పుకోవడంతో సరిపెట్టకుండా, వైద్యవృత్తిలో మళ్లీ నైతిక విలువలను ప్రతిష్ఠించినప్పుడే డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ కలలుగన్న ఆరోగ్యవంతమైన సమాజం సిద్ధిస్తుంది.

**- యండి. ఉస్మాన్ ఖాన్**
9912580645



## వైద్యులు

క్షణం జాప్యం కాకుండా
ప్రతి వ్యాధిని పలకరిస్తూ
రోగికి మానసిక స్థైర్యాన్నిస్తూ
మానవత్వాన్ని పరిమళిస్తూ
వృత్తిలోని మానవత్వాన్ని
అనునిత్యం చాటిచెప్పేవాడే వైద్యుడు
తిండిని మరిచి
నిదురను విడిచి
సమయం చూడక
సహనంతో సాహసాలు చేయగల నేర్పరులు
తదుపరి మందులతోనే కాక
మాటలతో ఔషధాన్ని
ఒలికించగల మంత్రముగ్దులు వైద్యులు

అవయవాల మార్పిడిలతో
అస్తమయాన్ని మరిపించగలరు
కుల, మత, జాతి వివక్షత చూపక
అద్భుతాలు సృష్టించగలరు
తలచుకుంటే చరిత్ర లిఖించగలరు
సుస్థిర స్థానాన్ని నిర్మించుకోగలరు
అందుకే అన్నారు వైద్యో నారాయణో హరి అని...!

**- వాసి జ్యోత్స్న**
9866843005

# అందమైన ఆడపిల్ల ..'తిలక్ అక్షరాలు'



దేవరకొండ బాలగంగాధర తిలక్ ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన అనన్యమైన కవి, కథకుడు, నాటకకర్త. భావుకత, అభ్యుదయం అనే పరస్పర విరుద్ధ ధోరణులను మేళవించిన తిలక్ రచనలు తెలుగు సాహిత్యంలో కొత్త రేఖలు గీశాయి. భావ కవులలో అభ్యుదయకవిగా, అభ్యుదయ కవులలో భావ కవిగా ఆయనకు ఉన్న ప్రత్యేకత ఆయన కవిత్వ విభిన్నతకు నిదర్శనం.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలంలోని మండపాక గ్రామంలో 1921 ఆగస్టు 1న తిలక్ జన్మించారు. తండ్రి సత్య నారాయణ మూర్తి స్వాతంత్ర్య సమరయోధుడిగా, బాలగంగాధర తిలక్ పట్ల గల గౌరవం తోనే కుమారునికి అదే పేరు పెట్టారు. తిలక్ బాల్యంలోనే తణుకుకు మకాం మార్చారు. తెలుగు, ఆంగ్ల భాషలలో అతని ప్రావీణ్యం విశేషం. ప్రాచీన భారతీయ సాహిత్యమే కాక ఆధునిక పాశ్చాత్య సాహిత్యంపై కూడా ఆయనకు మంచి అవగాహన ఉండేది. చదువుకు విఘ్నంగా నిలిచిన అనారోగ్యం ఆయనను పనిలో పనిగా స్వయంగా అధ్యయనానికి కట్టబెట్టింది. తన స్వంత జీవితానుభవాలనూ, సమాజపు చీకటి కోణాలనూ కలబోసి రచనలుగా మలిచాడు.

తిలక్ కవిత్వానికి ప్రధానంగా మానవతా విలువలు, సామాజిక చైతన్యం, సౌందర్యం, భావప్రాప్తి మూలాధారాలు. 'నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు. నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు. నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని తాను వ్యాఖ్యానించుకున్నట్లే - తిలక్ కవిత్వం ఓ మానవీయ అనుభవపథంగా ముందడుగు వేస్తుంది. తిలక్ కవిత్వంలో కరుణ అంతర్లీనంగా ప్రవహించే ప్రవాహంలా ఉంటుంది. ఆయన రచనల్లో అనాథలు, బిచ్చగాళ్లు, పడుపుగత్తెలు వంటి పీడిత వర్గాలు ప్రత్యక్ష పాత్రలుగా దర్శనమిస్తాయి. సౌందర్యం కూడా తిలక్ కవిత్వంలో ఒక అంతర్భాగం. ప్రకృతి,భావాలు,వ్యక్తిత్వం - అన్నింటిలోనూ ఆయన అందాన్ని అన్వేషించారు. వచన కవిత్వానికి ఒక నిర్మాణ సౌందర్యం, మృదుత్వాన్ని అందించిన ఘనత తిలక్‌దే. ఆయన భాష సుతిమెత్తగా ఉన్నా భావాలు పదునైనవిగా, నిదానంగా గుండెను తాకేలా ప్రవహిస్తాయి.

భావుకత, అభ్యుదయం అనే రెండు విభిన్న మలుపులను సమన్వయపరిచిన తిలక్ కవిత్వం, భావకవిత్వంలోని సున్నితత్వంతో అభ్యుదయ భావ జాలాన్ని మేళవించి అందించాడు. తిలక్ పద్య కవితను వదిలి వచన కవితకు మారాడు. అయితే ఆ వచనానికి పద్య సౌందర్యాన్ని మలచిన రచయితగా నిలిచాడు.

తిలక్ రచనలు అనేకం. ఆయన రచించిన కవితా సంపుటుల్లో ప్రభాతము -సంధ్య, గోరువంకలు, కఠినోపనిషత్తు, అమృతం కురిసిన రాత్రి ప్రసిద్ధమైనవి. ఇందులో చివరిదైన అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1971) లభించింది. ఈ సంపుటిలోని కవితలు ప్రేమ, మానవత్వం, కరుణతో నిండి ఉంటాయి.

అమృతం కురిసిన రాత్రి కవితలో తిలక్ రాత్రిని ప్రేమానుభూతుల ఆధ్యాత్మిక అంతరంగంగా చిత్రించారు: 'ఆ రాత్రి అమృతం కురిసింది - నా చిటికెన వేలి మీదనువ్వు గుబురు గుబురు మనిపించిన దాకా...'

ఇక్కడ 'అమృతం' అనే పదం ప్రేమను సూచించగా, చీకటి, వర్షం, ఊహా ప్రపంచం అతని అంతరాత్మను ప్రతిబింబించాయి. తిలక్ తన అనుభూతులను, స్పర్శలను, భావోద్వేగాల్ని అత్యంత సున్నితంగా వ్యక్తీకరించ గలిగాడు. కథా రచయితగా కూడా తిలక్ తనదైన ముద్ర వేశాడు. ఊరి చివరి ఇల్లు కథ సామాజిక స్పృహను కలిగించే ఓ మానవ సంబంధాల కథ. ఇందులో ఓ పేద కుటుంబం ఆశలు, పరాభవాలు, అసమానతలు ప్రతిబింబించబడతాయి. సహజమైన సంభాషణలు, పాత్రల మనో వ్యవహార విశ్లేషణలు ఈ కథలో ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. తిలక్ రచించిన సుశీలపెళ్లి, సుప్తశిల, సాలె పురుగు వంటి నాటకాలలో నూతన భావ విచారణ కనిపిస్తుంది. 'సుచిత్ర ప్రణయం' వంటి నాటిక ప్రేమ కథ నేపథ్యంలో వ్యక్తిత్వ విమర్శనాత్మకంగా నడుస్తుంది. ఆయన రచనలు మానవ స్వేచ్ఛకు విలువనిస్తూ సమాజాన్ని ప్రశ్నించేవిగా ఉంటాయి.

తిలక్ వ్యక్తిగత లేఖలు- తిలక్‌లేఖలు - ఆయన ఆత్మ విమర్శన, రచనా పద్ధతి, సమకాలీన సమాజంపై స్పందనలకు అద్దం పట్టే అద్భుతమైన సాహిత్యమైంది. ఈ లేఖల ద్వారా తిలక్ కేవలం రచయితగానే కాకుండా,ఒక మేధావిగా, ఆత్మసాధకునిగా కూడా కనిపిస్తాడు. 1966 జూలై 1న తిలక్ అకాల మరణం చెందాడు. ఆయన వయస్సు అప్పటికి కేవలం నలభై ఐదు సంవత్సరాలు మాత్రమే. కానీ ఆ కొద్ది కాలంలోనే తెలుగు సాహిత్యాన్ని తన రచనల ఝరితో సమృద్ధిగా ముంచెత్తాడు. తిలక్ మరణాన్ని గూర్చి మహాకవి శ్రీశ్రీ 'గాలి మూగదయింది, పాట బూడిదయింది' అని విచారం వ్యక్తం చేయడం తిలక్ ప్రభావాన్ని వెల్లడిస్తుంది. తిలక్ తెలుగు సాహిత్యంలో కరుణకు ప్రతిరూపం, సౌందర్యానికి మారుపేరు, మానవత్వానికి చిహ్నంగా నిలిచి పోయాడు. భావుకతను అభ్యుదయంతో మేళవించి, మానవతా విలువలకు ప్రాణం పోసిన తిలక్ రచనలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన కవిత్వం తెలుగు హృదయాల మధ్య శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

**జూలై 1...బాలగంగాధర తిలక్ వర్ధంతి**
**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494



## డివిజనల్ ఇంజనీర్ వడ్లూరి పరమాచారి సేవలు మరువలేనివి

- శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలి
- హౌసింగ్ కార్పొరేషన్ పిడి జె. రాజేశ్వర్

పెద్దపల్లి జూన్ 30 (మనం ప్రతినిధి): వివిధ ప్రభుత్వ సంస్థల్లో 40 సంవత్సరాల పాటు వివాదరహితుడుగా పనిచేసి హౌసింగ్ కార్పొరేషన్ లో పదవీ విరమణ పొందిన వడ్లూరి పరమాచారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని పెద్దపెల్లి జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పిడి జె.రాజేశ్వర్ అన్నారు. మంగళవారం రోజున పదవి విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన వీడ్కోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి పెద్దపల్లి డివిజన్లో డివిజన్ ఇంజనీర్ గా విశిష్ట సేవలందించి, వివాదారహితుడిగా సేవలందించి, తన తోటి సిబ్బందితో కుటుంబ సభ్యునిగా ఉంటూ విశిష్ట సేవలు అందించారని వారి సేవలు మరువలేనివని వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం మంథని డివిజనల్ ఇంజనీర్ దస్తగిర్, అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్ లు మాట్లాడుతూ పనే దైవంగా భావించి 40 సంవత్సరాల పాటు పలు ప్రభుత్వ సంస్థల్లో విశిష్ట సేవలు అందించారని, పనే దైవంగా భావించి పదవీ విరమణ పొందుతున్న డివిజనల్ ఇంజనీర్ వడ్లూరి పరమాచారి కు శుభాకాంక్షలు తెలుపుతూ వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని అన్నారు. అనంతరం వడ్లూరి పరమాచారి దంపతులను తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఏఈలు సిబ్బందితోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నితిన్ నబిన్‌ను కలిసిన కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్

**మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిపై దిశానిర్దేశం చేసిన పార్టీ నేషనల్ చీఫ్**



కరీంనగర్ జూన్ 30(మనం బ్యూరో): హైదరాబాద్ వేదికగా మంగళవారం రోజున జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కోలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.తెలంగాణలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ను కైవసం చేసుకుని, మేయర్ పీఠాన్ని దక్కించుకున్నందుకు నితిన్ నబిన్ మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పనిచేయాలని మేయర్, డిప్యూటీ మేయర్లకు నితిన్ నబిన్ సూచించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, బిజెపి రాష్ట్ర పరిశీలకులు సునీల్ బన్సల్ ను మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగర కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకోవడం పట్ల సునీల్ బన్సల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మేయర్ , డిప్యూటీ మేయర్లను సునీల్ బన్సల్ అభినందించారు.ఈ సందర్భంగా

**మేయర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ**

'పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ స్వయంగా అభినందించి సన్మానించడం తనకు మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని, వారి సూచనలను శిరసా వహిస్తామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. . ప్రస్తుతం స్మార్ట్ సిటీ, అర్బన్ డెవలప్మెంట్ నిధులతో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని , ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రతి డివిజన్ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతాం' అని మేయర్ కోలగని శ్రీనివాస్ తెలిపారు.

# గర్భిణీ స్త్రీలకు విశ్వహితసేవ ట్రస్ట్ బాసట

## పేదలకు ఉచితంగా ప్రసూతి సేవలు

## సేవలు పొందాలని నిర్వహకుల పిలుపు

## పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజాసింగ్



పెద్దపల్లి, జూన్ 30 (మనం న్యూస్): సమాజంలో ప్రతి గర్భిణీకి నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండటం అత్యవసరమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ సారథ్యంలోని విశ్వహిత సేవా ట్రస్ట్, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ ఆద్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన గర్భిణీ స్త్రీలకు ఉచితంగా ప్రసూతి సేవలు (డెలివరీ) సదుపాయాన్ని అందించే ప్రచార పోస్టరును ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా ప్రజలకు ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ తీసుకున్న నిర్ణయం గొప్పవరమని ఆనందం వ్యక్తం చేశారు. వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఆసుపత్రి నిర్వాహకులను అభినందించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్ మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా విశ్వహితసేవ ట్రస్ట్, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ ఉచిత ప్రసూతి సేవలను అందిస్తాయని తెలిపారు. అత్యంత ఖరీదుతో కూడిన డెలివరీ ప్రక్రియను పూర్తి ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. అదేవిధంగా పుట్టిన శిశువు ఆరోగ్య పరిరక్షణకు సైతం ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. వైద్యసేవలు కావల్సిన గర్భిణీ స్త్రీలు 9492202108 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చునని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో విశ్వహిందూ పరిషత్ నేతలు, ట్రస్ట్ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం

- 18 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం
- వర్షాకాల పారిశుద్ధ్యం, కరెంట్ పోల్స్, ఇందిరమ్మ ఇళ్లు, అమృత్ పనులు వేగవంతం చేయాలి
- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు



సుల్తానాబాద్, జూన్ 30 (మనం న్యూస్): సుల్తానాబాద్ పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో మొత్తం 18 అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే కౌన్సిలర్లు వార్డు పర్యటనలు నిర్వహించి ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టణంలోని వివిధ వార్డుల్లో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్పీడీసీఎల్ ఏఈకి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈకిసూచించారు.పట్టణంలో తాగునీటి సరఫరాను సక్రమంగా నిర్వహించడంతో పాటు, అమృత్ పథకం నిధులతో నిర్మిస్తున్న నూతన వాటర్ ట్యాంక్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా స్వశక్తి సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేసేందుకు మెప్మా మిషన్ డైరెక్టర్కు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు ఈర్ల స్వరూప, గాజుల రాజమల్లయ్య, కందునూరి సమత, గరిగె శోభారాణి, బాకం సాయికిరణ్, వరప్రదీప్ ఊట్ల, చింతల రాజు, తొర్రికొండ ప్రభాకర్, కల్వల శంకరమ్మ, సిద్ధ తిరుపతి, వేగోళం పద్మ, గాదాసు మంజుల, ఎన్పీడీసీఎల్ ఏఈ, హౌసింగ్ ఏఈ, ఇరిగేషన్ ఏఈతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# అతివేగం వద్దు – ప్రాణం ముద్దు

- రోడ్డు ప్రమాదాల నివారణకు సుల్తానాబాద్ పోలీసుల వినూత్నచర్య
- 3డి రేడియం పోలీస్ వాహనాల ఏర్పాటు
- ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం
- సురక్షిత ప్రయాణమే మా లక్ష్యం





సుల్తానాబాద్ జూన్ 30 (మనం న్యూస్): సుల్తానాబాద్ మండల పరిధిలోని ప్రధాన రహదారులపై తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. రంజిత్ రావు,సబ్ ఇన్స్పెక్టర్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో 3డి రేడియం పోలీస్ ఇన్నోవా వాహనాల నమూనాలను ఏర్పాటు చేశారు.నారాయణపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఒకటి, ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ సమీపంలోని కాట్నపల్లి వద్ద మరొకటి ఏర్పాటు చేయగా, వీటిని దూరం నుంచే గమనించిన వాహనదారులు అక్కడ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారనే భావనతో వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రేడియం ప్రతిఫలనం వల్ల ఈ నమూనాలు స్పష్టంగా కనిపించడం ద్వారా వాహనదారులు మరింత జాగ్రత్తగా వాహనాలు నడుపుతున్నారు. ఈ వినూత్న చర్యతో అతివేగం తగ్గి, రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు, వాహనదారులు, వ్యాపారులు అభినందిస్తూ సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. రంజిత్ రావు, సబ్ ఇన్స్పెక్టర్ చంద్రకుమార్ సేవలను ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. అతివేగంతో వాహనాలు నడపవద్దని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారమ్ల పంపిణీ, సేకరణ ప్రక్రియను

# వేగవంతంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



జగిత్యాల, జూన్ -29:(మనం ప్రతినిధి): సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి సుదర్శన్ రెడ్డి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్ పై సేకరణ పురోగతిని సమీక్షించారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత పాల్గొన్నారు జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ (గణన) ఫారమ్లు పంపిణీ, సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారమ్లను బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ లు) మాత్రమే ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరుకు నేరుగా పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతి అర్హత గల ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారమ్లు అందజేయాలని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్లు (బి ఎల్ ఏ లు) కేవలం ఓటర్లను గుర్తించేందుకు మాత్రమే సహకరించాలని, ఫారమ్ల పంపిణీ లేదా సేకరణలో వారు పాల్గొనరాదని స్పష్టం చేశారు. అలాగే, పంపిణీ చేసిన ఫారమ్లను ఓటర్లు పూర్తిగా నింపిన అనంతరం బి ఎల్ ఓ లు తిరిగి ఇంటింటికీ వెళ్లి వాటిని సేకరించాలని, సేకరించిన ఫారమ్లను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారమ్ను బి ఎల్ ఓ కు తిరిగి అందజేయని పక్షంలో సంబంధిత ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేయబడదని ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లందరూ ఈ ప్రక్రియలో పూర్తి సహకారం అందించి, తమ వివరాలను సకాలంలో సమర్పించడం ద్వారా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు అయ్యేలా చూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జగిత్యాల , కోరుట్ల, మెట్ పల్లి ఆర్.డి.ఓ లు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహరావు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్ లు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉదారతను చాటుకున్న సర్పంచ్ గుమ్మడి

- మహిళా సంఘ భవన నిర్మాణానికి సొంత స్థలం వితరణ



రామడుగు, జూన్ 30 (మనం న్యూస్): మన సొంత స్థలం పక్క వాళ్లకు ఒక ఇంచు జాగా పోతుంది అంటే పంచాయతీలు పెట్టుకొని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న ఈ రోజుల్లో మహిళ సంఘ భవనం కట్టడానికి భూమి ఇచ్చి తన ఉదారతను చాటుకున్నాడు ఈ సర్పంచ్. వివరాల్లోకి వెళితే... కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేసింది. కాని ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం గ్రామంలో మహిళా సంఘ భవనం నిర్మించడానికి తన సొంత స్థలాన్ని ఇచ్చి తన ఉదాహరణ చాటుకున్నాడు. మంగళవారం గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం సంఘ సభ్యులు, పాలకవర్గం మహిళా సంఘ భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సయ్యద్ ఫిరోజ్, వార్డు సభ్యులు సోయల్, మేడి వజ్రమ్మ ఏపీ ఎం జ్యోతి కార్యదర్శి జనార్ధన్ మహిళ గ్రూప్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి నియోజకవర్గ రహదారులకు మహర్దశ

- రూ.1,400 కోట్ల నిధులతో రోడ్ల అభివృద్ధి
- 120 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- కల్వకుర్తి పట్టణంలో జూలై 2న మహనీయుల సభ
- హాజరుకానున్న పలువురు మంత్రులు
- జూలై 4న మిడ్జిల్‌లో సీఎం బహిరంగ సభను విజయవంతం చేద్దాం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి జూన్30(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సుమారు రూ.1,400 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,మంత్రి సీతక్కల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.120 కిలోమీటర్ల నియోజకవర్గ అంతర్ రోడ్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. హాం,హెచ్ఎండిఏ,పథకం కింద 28 రోడ్లను మంజూరు చేయించగా,వాటి ద్వారా సుమారు 160 కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి చెందనున్నాయని వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి ఫలాలను అందిస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని తెలిపారు..

**జూలై 2న కల్వకుర్తి పట్టణంలో మహనీయుల సభ...**

మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న 'మహనీయుల బస్సు యాత్ర'కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు.గత నెల 2 న ప్రారంభమైన బస్సు యాత్ర ఈనెల 2న ముగియనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ముగింపు సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి,లతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.

**జూలై 4న సీఎం బహిరంగ సభ విజయవంతం చేద్దాం..**

మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలంలో రైతు బాంధవుడు స్వర్గీయ ద్యాప గోపాల్ రెడ్డి శతజయంతి బహిరంగ సభను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ధ్యాప గోపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతాంగానికి రైతుల అభ్యున్నతికి జీవితాంతం చేసిన సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న శతజయంతి సభను ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్,మహనీయుల సభ ఇంచార్జీ బృంగి ఆనంద్ కుమార్,వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల్ల రాములు,కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జీ ఏలుగొండ మధుసూదన్ రెడ్డి,కల్వకుర్తి మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్,మబ్బు రామరాజు, నాజియా మక్బుల్,కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,వెల్దండ మండల అధ్యక్షుడు హరికిషన్ నాయక్,నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, పడకంటి వెంకటేష్,దున్న సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ అధికారుల పదవీ విరమణ వేడుకలు




కరీంనగర్, జూన్ 30(మనం బ్యూరో): కరీంనగర్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిరంతర సేవలు అందించి, ఈ పదవీ విరమణ పొందిన ఏడుగురు (7) పోలీస్ అధికారుల సన్మాన కార్యక్రమం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ చేసిన అధికారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, సమాజ రక్షణలో పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, తమ జీవితంలో అత్యధిక భాగాన్ని ప్రజల శాంతిభద్రతల కోసం కేటాయించి, ఈరోజు విజయవంతంగా పదవీ విరమణ సాధించడం అభినందనీయమని కొనియాడారు. విధినిర్వహణలో వారు చూపిన ప్రతిభ, క్రమశిక్షణ యువ పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన అధికారులు మహమ్మద్ ఇర్షాద్,బుర్ర ఎల్లయ్య గౌడ్ ,.మొగురం సుధాకర్ ,బి. అంజయ్య ,జి. వెంకటస్వామి ,తోట మల్లయ్య ,జి. ఉపేందర్ ,లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ,రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్త్రు మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా కసితో చదవాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- నిబంధనలు పాటించని ఉపాధ్యాయుడికి మెమో జారీ
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో): విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రతి విద్యార్థి కసితో చదవాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో నేరుగా కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి అనేది ప్రతి విద్యార్థికి కీలక దశ అని, ప్రస్తుతం బాగా చదివితేనే తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారించి సాధన చేసేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆదేశించారు. గతేడాది పదవ తరగతి విద్యార్థులు సాధించిన మార్కుల కంటే ప్రస్తుత విద్యార్థులు ఇంకా ఎక్కువగా సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేకంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎవరైనా సెలవు పెడితే ఒకటి, రెండు రోజులు ముందుగానే సంబంధిత ఉన్నతాధికారులకు సెలవు చీటీ ఇవ్వాలని చెప్పినప్పటికీ పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు మంగళవారం ఉదయం వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు మెమో జారీ చేయాలని జిహెచ్ఎం రేణుకా దేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తో పాటు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రిజిస్టర్ ను కలెక్టర్ క్షుణంగా పరిశీలించారు. ఫుడ్ 3కమిటీ సభ్యులుగా ఉన్న విద్యార్థులు క్రమం తప్పకుండా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని విద్యార్థులకు గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా భోజనాన్ని వండించాలని ఆదేశించారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు యూ డైస్ లో నమోదు చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థిని నందిని ఫుట్ బాల్ లో ప్రతిభ చాటి గచ్చిబౌలిలోని నేషనల్ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికవడంతో కలెక్టర్ విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉర్కొండ పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు



- పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు
- రాష్ట్ర సీఎం పర్యటన విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగం సింగ్ జి పాటిల్ లు అన్నారు. మంగళవారం మండల స్థాయి నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే జూలై నెలలో నాగర్కర్నూల్ జిల్లా ఉర్కొండ మండల కేంద్రంలోని అత్యంత ప్రసిద్ధ గాయించిన శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకోనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో పాటు పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి ఉర్కొండలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. తధానంతరం ఆలయ పండితులు ఆశీర్వాదాలు, తీర్థ ప్రసాదాలను కలెక్టర్, ఎస్పీకి అందజేశారు. అధికారులతో కలిసి పబ్బతి శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలను సందర్శించి, ముఖ్యమంత్రి ఆలయ దర్శనం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఆలయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఉర్కొండపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని సందర్శించి, ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ప్రతిపాదించే హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, హెలికాప్టర్ దిగిన అనంతరం కాన్వాయ్ రాకపోకలకు అవసరమైన రహదారుల పరిస్థితి, బ్యారికేడింగ్, పోలీసు బందోబస్తు, అగ్నిమాపక, అంబులెన్స్ తదితర అత్యవసర సేవల ఏర్పాట్లపై అధికారులతో సమగ్రంగా చర్చించి తగిన సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా ఉర్కొండ మండలంలో ప్రతిపాదించిన ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి అధికారుల కార్యాలయ సముదాయం నిర్మాణానికి, నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాలను కూడా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా అన్ని మౌలిక వసతులతో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థల సేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి, నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఉర్కొండ రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జిల్లాకు ఎంతో ప్రతిష్మాత్మకమైనదని, ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. అప్పగించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్, ఎస్పీ లు స్పష్టం చేశారు. మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో పరిశుభ్రత, పచ్చదనం రోజువారి కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన రహదారులు, గ్రామ వీధులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య కేంద్రాలు, ఆలయ పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. మొక్కలు నాటడం, రహదారుల వెంట చెత్త తొలగించడం, కాలువల శుభ్రత, తాగునీటి వసతుల మెరుగుదల వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. వానాకాలం సాగు సీజన్ను దృష్టిలో ఉంచుకుని రైతులకు యూరియా, విత్తనాల కొరత తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం మండలంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, విత్తనాల సరఫరా పరిస్థితిపై మండల వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పోలీసు అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. ఆలయ పరిసరాలు, హెలిప్యాడ్, ప్రయాణ మార్గాలు, సభా ప్రాంగణం తదితర ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, జిల్లా ఏడి సర్వేయర్ గిరిధర్, ఉర్కొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, ఎంపీడీవో, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# విధుల నిర్వాహణలో అలసత్వం వద్దు



- ఫీల్డ్ వర్క్‌కు వెళ్లినా ఆఫీసుకు వచ్చి వెళ్లాలి
- విద్యార్థులకు మెనూ ప్రకారము భోజనం, టిఫిన్ పెట్టాలి
- జిల్లా కలెక్టర్ కే. హైమావతి

**సిద్దిపేట, జూన్ 30(మనంప్రతినిధి):** ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని జిల్లా కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. విధి నిర్వహణలో తప్పనిసరి నిబంధనలు పాటించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉద్యోగులు ఫీల్ వర్క్ కు వెళ్ళినప్పుడు తమ ఆఫీసుకు వచ్చి అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకాలు పెట్టిన తర్వాతనే వెళ్లాలని పేర్కొన్నారు. ఫీల్ వర్క్ లో ఉన్న సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉన్నారా లేదా అని వీడియో కాల్ ద్వారా పర్యవేక్షించారు. ఇంకా సీజనల్ వ్యాధులు వ్యాపించే పరిస్థితులు ఉన్నదని ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారదర్శకంగా ఎస్ ఐ ఆర్ సర్వే జరగాలి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు వస్తున్నారని కలెక్టర్ స్థానిక సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో సర్వే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సర్వే పట్ల ఏలాంటి సమస్యలు ఉత్పన్నమైన పై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ₹నాణ్యమైన భోజనం అందించాలి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, టిఫిన్ అందించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని, రోజు ఏ ఏ రకాల కూరగాయలు వడ్డిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇంకా ఈ కార్యక్రమాల్లో అధికారులు పలువురు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేలు

- ‘రహవీర్’, ‘పీఎం రహత్’ పథకాలపై అడిషనల్ కలెక్టర్ విక్టర్ సమీక్ష
- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు క్యాష్లెస్ ఉచిత వైద్యం
- ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో 7 రోజుల వరకు ఉచిత చికిత్స



**కామారెడ్డి, జూన్ 30 (మనం ప్రతినిధి):** రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్, 'పీఎం రహత్' పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు మంగళవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన పథకాల అమలు తీరును సమీక్షించారు. ప్రమాదం జరిగిన తొలి గంటను (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమైనదిగా పేర్కొంటూ, ఈ సమయంలో బాధితుడిని ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. సహాయం చేసిన వారిని పోలీసులు లేదా కోర్టులు వేధిస్తారనే భయానికి తావు లేదని, వారికి చట్టపరమైన రక్షణ కల్పించబడుతుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి సంవత్సరంలో గరిష్టంగా ఐదు సార్లు ఈ బహుమతి పొందే అవకాశం ఉందన్నారు. ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తిస్తుంది. అలాగే పీఎం రహత్ (రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్ హాస్పిటలైజేషన్ అండ్ అష్యూర్డ్ ట్రీట్మెంట్) పథకం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ప్రతి బాధితుడికి ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు ఉచిత (క్యాష్లెస్) వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం జాతీయ రహదారులకు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తిస్తుందని వివరించారు. అనంతరం నిర్వహించిన అప్రిసియేషన్ కమిటీ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ వి. విక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్, జిల్లా రవాణా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల్లో ఈ రెండు పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

# ఓటరు జాబితా ప్రజాస్వామానికి మూల స్తంభం

- బిఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో):** మంగళవారం తాడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఖిఇఛిజీజూ ఇఖ్లుఃఱజీర్ఛి ఖఠిజీఃఱజ్ఛొ-ఖిఐఖ) కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల న్నారు. బిఎల్వోలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాన్ని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు అందజేసేలా ప్రజలకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోవచ్చనే అంశాన్ని ప్రతి కుటుంబానికి స్పష్టంగా వివరించాలని బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయడం ప్రతి అధికారికి బాధ్యతని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గడ్డం విజయ్ నివాసానికి వెళ్లి బీఎల్ఓ విజయ ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బీఎల్ఓలతో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయిలో ఇలా పంపిణీ చేస్తున్నారు ఎలా అవగాహన కల్పిస్తున్నారనే విధానంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ......, ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడమే కాకుండా, వాటిని ఎలా నింపాలి, ఏయే కాలమ్లలో ఏ వివరాలు నమోదు చేయాలి, ఎలాంటి ఆధార పత్రాలు జత చేయాలి, పూర్తి చేసిన ఫారాలను ఎప్పటిలోగా బీఎల్ఓలకు తిరిగి అందజేయాలి అనే విషయాలను ప్రజలకు ఓర్పుతో, స్పష్టంగా వివరించాలన్నారు. ప్రజల్లో ఎలాంటి అపోహలు, సందేహాలు లేకుండా అవగాహన కల్పించడం బీఎల్ఓల ప్రధాన బాధ్యతని తెలిపారు. ఎవరైనా ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే మరోసారి వెళ్లి ఫారాలను అందజేయాలన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఈ ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని ఆదేశించారు. కొత్తగా అర్హత పొందిన యువత, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సహా ప్రతి అర్హుడికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అక్కడి ఓటర్లతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి బీఎల్ఓలు అందజేసిన ఎన్యూమరేషన్ ప్రొఫార్మాను ఎలా నింపుతారు, ఫారంలో ఏ వివరాలు నమోదు చేయాలి, అవసరమైన పత్రాలు ఏమిటి, పూర్తి చేసిన ఫారాలను ఎప్పటిలోగా బీఎల్ఓలకు అందజేస్తారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని గడువులోపు ఫారాలను సమర్పించాలన్నారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమన్నారు. అందులో ప్రతి అర్హుడి పేరు ఉండడం అత్యంత అవసరమని అందుకే ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి బీఎల్ఓ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్దేశించిన గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల నాగమణి అనే మహిళ జిల్లా కలెక్టర్ను కలిసి తనకు ప్రస్తుతం పూరిగుడిసె మాత్రమే ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, తన కుటుంబానికి కూడా ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆమె సమస్యను ఓపికగా విన్న జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన ప్రతి కుటుంబానికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో కచ్చితంగా గృహం మంజూరు అవుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే గృహ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసుకునేలా ముందస్తుగా సిద్ధంగా ఉండాలని ఆమెకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట తాడూరు మండల తహసీల్దార్ రామకృష్ణ, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, బూత్ లెవల్ అధికారిని విజయా తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలి




- గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిపి

**గజ్వేల్ జూన్ 30 మనం న్యూస్:** నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్ ప్రత్యేక దృష్టి సారించాలని సిపి రష్మీ పెరుమాళ్ పోలీస్ అధికారులకు సూచించారు. గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సిపి రష్మీ పెరుమాళ్ మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సిపి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సూచనలు చేశారు. పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు, సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన సిపి సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులను పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. ఎస్ ఓ పి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని , తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను సందర్శించాలని , సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ రవిరాజు కి సూచించారు. సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని ,అదేవిధంగా సిద్దిపేట సురక్ష నేత్ర లో భాగంగా సిసి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సిపి మొక్కలు నాటడం జరిగింది. నూతనంగా ఏర్పాటు చేసిన 6 సిసిటీవి కెమెరాలు, వాహన పార్కింగ్ షెడ్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, సి.ఐ రవిరాజు, ఎస్సైలు ఆరోగ్యం, రఘుపతి, కృష్ణ రెడ్డి , యోనుస్ ఖాన్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చేసిన సేవలు గుర్తుండిపోతాయి

**హైదరాబాద్, జూన్ 30(మనంన్యూస్):** విధుల్లో చేసిన సేవలు ఎప్పటికి గుర్తుండిపోతాయని టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ లు అన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వెలుగొండ శ్రీరాములు డిస్టిక్ సర్వే ఆఫీసర్గా పదవి విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు సర్వీస్ లో వచ్చిన రోజే రిటైర్మెంట్ డే కూడా రాశి ఉంచుతారు దాని క్రమంలోనే శ్రీరాములు గారి పదవి విరమణ ఉత్సవంలో చాలామంది అధికారులు ఉద్యోగులు పాల్గొని హైదరాబాద్ జిల్లాకు సర్వే డిపార్ట్మెంట్ చేసిన సేవలు అన్నిటిని కూడా గుర్తు చేసుకుంటూ రాబోయే రోజుల్లో ఇంకా మంచి ఆరోగ్యము ఆయుష్షు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, భీమ్ రెడ్డి, ప్రశాంత్, వెంకటరెడ్డి, మల్లేష్, బుచ్చన్న పాల్గొన్నారు.




# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



- నిర్మలా జగ్గారెడ్డి
- రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- జిల్లాలో 2,42,753 మంది రైతులకు లబ్ధి
- రూ.125.83 కోట్ల ఆర్థిక సహాయం విడుదల.

**సంగారెడ్డి జూన్ 30 మనంప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘రైతు భరోసా’ వానాకాలం-2026 వాయిదా తొలి విడత నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాడు హైదరాబాద్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి లోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంగారెడ్డి టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ విడతలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 2 ఎకరాల వరకు వ్యవసాయ భూమి కలిగిన 2,42,753 మంది అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రూ.125.83 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, వానాకాలం సాగు పనులు మొదలవుతున్న తరుణంలో రైతులకు పెట్టుబడి సాయం అందించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఈ నిధులు జిల్లాలోని రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. పారదర్శకంగా నిధుల జమ: జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అర్హులైన 2.42 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్నాయని తెలిపారు. అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జులై 4న మిడ్జిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి

**మహబూబ్ నగర్ జూన్ 30(మనం ప్రతినిధి)** జులై 4న మిడ్జిల్ మండల కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా మంగళవారం మిడ్జిల్లో విస్తృతంగా పర్యటించి మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన ఎలుగొండ రాంరెడ్డి భూమి లో సభా వేదిక, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణకు సిద్ధం చేస్తున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహంతో పాటు మాజీ మంత్రి ద్యపా గోపాల్ రెడ్డి విగ్రహాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విగ్రహాల వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం నిర్మించనున్న నూతన బస్ షెల్టర్కు ప్రతిపాదించిన స్థలాన్ని సందర్శించి, పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా మిడ్జిల్కు మరిన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. మిడ్జిల్ మండలంలో ఈ పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అల్వాల్ రెడ్డి మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య,మిడ్జిల్ సర్పంచ్ ఎడ్ల శంకర్.



మాజీ ఎంపీటీసీ గౌస్,నాయకులు సాయిలు,మల్లికార్జున్ రెడ్డి పర్వతాలు ఉస్మాన్, యాదయ్య , మిడ్జిల్ తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జడ్చర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరి జనం'లో మైనింగ్ మాఫియా

- కొండలను పిండి చేస్తున్నరు ● బినామీ మాటున గనుల దందా....!
- పర్యావరణానికి పాతర ● క్వారీకి అనుమతులున్నయా సారూ?
- పర్యావరణ ముచ్చట దేవుడెరుగు.. తక్కిన కాగితాలైనా ఉన్నయా?
- పీసీబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? ఇరిగేషన్ శాఖ లొల్లి ఏమైంది...?
- గిరిజన అవ్వ పేరు ముందు పెట్టి.. వెనక గద్దల్లా దోస్తున్నదెవరు...?
- అశ్వారావుపేట గనుల దందాపై విచారణ జరుపాల్నని జనం డిమాండ్



**అశ్వారావుపేట, జూన్ 30(మనం న్యూస్):** అశ్వారావుపేట మండల లొల్లి ఇప్పుడు గనుల శాఖ దాకా చేరింది. ఆసుపాక - నారాయణపురం గ్రామాల నడుమ, ఖమ్మంపాడు వాగు పక్కన సాగుతున్న ఫెల్డ్‌స్పార్ మైనింగ్ తవ్వకాలు చూస్తుంటే ముక్కున వేలేసుకునే పరిస్థితి వచ్చింది. ఏజెన్సీ చట్టాల పేరిట మిడియం రాజమ్మ అలియాస్ రాములమ్మ అనే గిరిజన మహిళ పేరు ముందు పెట్టి, లీజ్ ప్రొసీడింగ్స్ (నంబర్: 578/క్యు/2024) తెచ్చుకొని ఇక్కడ కొండలను పిండి చేస్తున్నారు.

సరే.. పత్రికలల్ల వస్తున్న ముచ్చట్ల ప్రకారం చూస్తే ఈ క్వారీకి అసలు పర్యావరణ అనుమతులు లేవనే అనుమానాలున్నాయి. పోనీ.. ఆ ముచ్చట పక్కన పెడితే, ఒక క్వారీ నడపాల్నంటే కావాల్సిన తక్కిన సర్కారు అనుమతులైనా ఈడ ఉన్నయా? లేక అంతా 'గోల్మాల్' ధందానేనా అని అశ్వారావుపేట జనం ముక్కుసూటిగా అడుగుతున్నారు.

### పీసీబీ కండ్లల్ల మన్ను కొడుతున్నరా?

మైనింగ్ తవ్వకాలు జరపాల్నంటే కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) నుంచి 'కాన్సెంట్ టు ఎస్టాబ్లిష్', 'కాన్సెంట్ టు ఆపరేట్' అని రెండు పెద్ద అనుమతి పత్రాలు కావాలె. దుమ్ము, ధూళి లేవకుండా ఏం జాగ్రత్తలు తీసుకుంటున్నారో చెప్పాలె.

కానీ, ఈడ చూస్తే 30 అడుగుల లోతుకు తవ్వేసి, ఊట్లపల్లి క్రషర్లకు రాత్రింబవళ్లు లారీలు నడుపుతున్నా పీసీబీ సార్లు ఎందుకు పట్టించుకుంటలేరు? ఈ క్వారీకి అసలు కాలుష్య నియంత్రణ కాగితాలు ఉన్నయా లేవా అని ఆఫీసర్లను జనం నిలదీస్తున్నారు.

### ఇరిగేషన్ సార్ల ఎన్ఓసీ ఏది?

రైతులకు బతుకుదెరువైన పెద్దవాగు ప్రాజెక్టు, ఖమ్మంపాడు చెక్‌డ్యామ్ రిజర్వాయర్ పక్కనే ఈ మైనింగ్ నడుస్తోంది. మునుపు ఇదే తవ్వకాల వల్ల నీళ్లకు ఆటంకం వస్తుందని అప్పటి ఇరిగేషన్ ఈఈ సారు నోటీసులు ఇచ్చి పనులు బంద్ పెట్టమన్నడు. మరి ఆ లొల్లి అట్లనే ఉండగా.. నీటిపారుదల శాఖ నుంచి గాని, గ్రౌండ్ వాటర్ బోర్డు నుంచి గాని ఈ క్వారీకి ఎన్ఓసీ ఎట్లా వచ్చింది? ఎండాకాలంలోనే భూగర్భ జలాలు ఊరి బయటకు వస్తున్నా, జలవనరుల శాఖ అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదనేది సందేహంగా ఉంది.

### గ్రామసభ తీర్మానం, రెవెన్యూ మార్కింగ్ జరిగిందా?

ఇది ఏజెన్సీ ప్రాంతం గనుక ఇక్కడ 1/70 చట్టం, పెసా చట్టం కింద లోకల్ గ్రామసభ తీర్మానం లేదా గ్రామ పంచాయతీ పర్మిషన్ ముఖ్యం. రాజమ్మ పేరుతో లీజు తెచ్చేటప్పుడు ఈ ఊరి జనం ఒప్పుకున్నరా? అలాగే, ఇచ్చిన 2.270 హెక్టార్ల హద్దులు దాటి పక్కనున్న సర్కారు(శివాయి) భూములు, వాగు పోరంబోకు స్థలాల్లోకి చొరబడకుండా రెవెన్యూ సార్లు సరిహద్దు రాళ్లు పాతిన్రా? దానికి సంబంధించిన లీగల్ సర్వే కాగితాలెక్కడ ఉన్నాయి? ఈ క్వారీ వ్యవహార అవసరాల నిమిత్తం రాజమ్మ భూమికి ఆనుకుని ఉన్న శివాయి భూముల్లల్ల నీళ్ల బోరు వేస్తే రెవెన్యూ సార్లు ఎందుకు పట్టించుకోవడం లేదు. ఈ సార్లకు ఫోన్లు చేసి ఇంత అక్రమం ఇక్కడ జరుగుతుందని చెప్పినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడానికి గల కారణాలు ఏమిటో?నని ప్రజలు పేర్కొంటున్నారు..

### అవ్వ పేరు మీద దందా.. జీఎస్టీ కడుతున్నదెవరు?

చట్టం ప్రకారం చూస్తే.. క్వారీ నుంచి తరలే ప్రతి టన్ను ఖనిజానికి లీజ్ హోల్డర్ రాజమ్మ పేరిటే జీఎస్టీ బిల్లులు దిగాలె, సర్కారుకు రాయల్టీ పైసలు కట్టాలె. కానీ ఇక్కడ నడుస్తున్న కథ వేరే ఉంది. గిరిజన అవ్వ రాజమ్మను కేవలం కాగితాలకే పరిమితం చేసి, వెనక ఉండి కోట్ల రూపాయల అక్రమ సంపాదన దోచుకుంటున్న బడా బాబులు ఎవరు? ఈ పన్నుల లావాదేవీలన్నీ పక్కాగా జరుగుతున్నయా లేదా అని టాక్స్ అధికారులు ఎందుకు చెక్ చేస్తలేరు? కేవలం పర్యావరణ అనుమతులే కాదు.. పీసీబీ క్లియరెన్స్, ఇరిగేషన్ ఎన్ఓసీ, రెవెన్యూ హద్దులు, మరియు పక్కా జీఎస్టీ రికార్డులు ఈ క్వారీకి ఉన్నాయో లేవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సాబ్, మైనింగ్ ఆఫీసర్లు వెంటనే క్షేత్రస్థాయికి వచ్చి తనిఖీ చేయాలె. కాగితాలు లేకపోతే ఈ అక్రమ క్వారీని తక్షణమే సీజ్ చేసి, ఏజెన్సీ చట్టాలను కాపాడాలని స్థానిక గిరిజనులు, ఆయకట్టు రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: సీసీఆర్



**కొణిజర్ల,జూన్ 30 (మనం న్యూస్):** జిల్లాలో ప్రతి పౌరుడికి నాణ్యమైన, సురక్షితమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీసీఆర్ (కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం-2010ను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. డి. రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీసీఆర్ జిల్లా కోఆర్డినేటర్ రవిచంద్ర భూపాల్ కోట, ఎస్.కె. షరీఫ్, మురళి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం నిబంధనలను తప్పనిసరిగా అమలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, తగిన సిబ్బంది, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్-2019లోని సెక్షన్ 2(42) ప్రకారం వైద్యులు, ఆసుపత్రులు అందించే సేవలు 'సర్వీస్' పరిధిలోకి వస్తాయని, వైద్య సేవలు పొందే రోగులు 'వినియోగదారులు' గా పరిగణించబడతారని తెలిపారు. వైద్య సేవల్లో లోపాలు తలెత్తినప్పుడు వినియోగదారుల కమిషన్ ద్వారా న్యాయపరమైన పరిష్కారం పొందే హక్కు ప్రజలకు ఉందన్నారు.రోగులకు సమగ్ర సమాచారం తెలుసుకునే హక్కు, ఫిర్యాదు చేసే హక్కు, నాణ్యమైన వైద్య సేవలు పొందే హక్కు చట్టబద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఆసుపత్రిలో అందిస్తున్న సేవల వివరాలు, వైద్యులు, సిబ్బంది అర్హతలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను ప్రజలకు కనిపించేలా బోర్డులపై ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల ఆరోగ్య హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం, వైద్య శాఖ సమన్వయంతో పనిచేసి వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలల్లో ఆహార నాణ్యత మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- జూలూరుపాడు మండల పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు





**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 30 (మనంప్రతినిధి):** జూలూరుపాడు మండలం జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. ఏడో, ఎనిమిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఔటింగ్ రిజిస్టర్ను తనిఖీ చేసిన కలెక్టర్, బాలికలను తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయటకు పంపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం కిచెన్ షెడ్ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. స్టోర్రూమ్లో నిల్వ ఉంచిన సరుకులను పరిశీలించారు. అనంతరం కిచెన్ షెడ్ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. స్టోర్రూమ్లో నిల్వ ఉంచిన సరుకులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మతులు ఆలస్యమవుతున్న కారణాలను అడిగి తెలుసుకుని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పాఠశాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా పప్పు పలుచగా ఉండటంతో పాటు నాణ్యత లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. తాను మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఆహార నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. తాగునీరు, పరిశుభ్రత, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెంపుతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం కలిగేలా విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి,ఎంఈఓ జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల నిరసన

## శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ బుక్స్ గోడౌన్లు సీజ్




**ఖమ్మం, జూన్ 30(మనం న్యూస్):** ఖమ్మం పట్టణంలోని మమతా రోడ్లో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్లో అధిక ధరలకు పుస్తకాలు విక్రయించడం, అలాగే పాఠశాల లోగోలతో నోటుబుక్స్, పాఠ్యపుస్తకాలను తల్లిదండ్రులకు బలవంతంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ విషయాన్ని జిల్లా డీఈఓ, అదనపు కలెక్టర్, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించారు. విద్యాశాఖ మండల విద్యాధికారి శైలజ విద్యార్థి సంఘాల నాయకుల సమక్షంలో తనిఖీలు నిర్వహించి రెండు గోడౌన్లను సీజ్ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలు అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నాయని, నోటుబుక్లను సైతం తల్లిదండ్రులకు బలవంతంగా కొనుగోలు చేయిస్తూ వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల లోగోలతో నోటుబుక్లు, పాఠ్యపుస్తకాలు విక్రయించడం నిషేధం అయినప్పటికీ, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు ఈ విధానాన్ని కొనసాగిస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నాయని వారు విమర్శించారు.

ప్రైవేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న ఈ తరహా అక్రమాలపై జిల్లా వ్యాప్తంగా సమగ్ర తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మంద సురేష్, ఐసా జిల్లా కార్యదర్శి జెమ్మి అశోక్, బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు బాబు, పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా కార్యదర్శి రాము, గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, బీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, విద్యార్థి సంఘ నాయకులు శ్రీధర్, పవిత్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించాలి: టిఎస్పిఈ జేఏసీ




- 7వ దశ సీఈ కార్యాలయానికి బైక్ ర్యాలీ

**పాల్వంచ, జూన్ 30(మనం న్యూస్):** ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని కాపాడడంతో పాటు కార్మిక శ్రేయస్సును కాంక్షించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ స్పష్టం చేసింది. మంగళవారం జేఏసీ పిలుపుమేరకు ఇంజనీర్లు, కార్మికులు ప్రైవేటీకరణ ప్రతిపాదనను నిరసిస్తూ.. కేటీపీఎస్ ఏడవ దశలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కేటీపీఎస్ అంబేద్కర్ కూడలి నుండి ఏడవ దశ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ.. వై టి పి ఎస్ టెండర్ల ప్రక్రియ అర్థరహితమన్నారు. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను తీవ్రంగా ఖండించారు. విద్యుత్తు రంగంలో ప్రైవేటీకరణ వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడటమే కాక, ప్రభుత్వ విద్యుత్ సంస్థల సామర్థ్యం, భద్రత, ప్రజా ప్రయోజ నాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో జేఏసి చైర్మన్ రాజేందర్, కన్వీనర్ ఎస్.కె యాస్మిన్, జేఏసీ నాయకులు బ్రహ్మాజీ, ఉమామహేశ్వరరావు, మహేష్, రఘువీర్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సీతారా మిరెడ్డి, ప్రభాకర్, నరసింహారావు, సయ్యద్, గిరిధర్, మధుబాబు, కళాధర్, సంపత్, పావని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన పల్స్ పోలియో

## 99.3 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు
## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు



**ఖమ్మం, జూన్ 30(మనం బ్యూరో):** ఖమ్మం జిల్లాలో ఈ నెల జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు తెలిపారు. కార్యక్రమం తొలి రోజు జూన్ 28న జిల్లాలోని 1,25,322 మంది 0-5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం లక్ష్యంగా ఉన్న 1,31,642 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండో, మూడు రోజుల్లో నిర్వహించిన గృహ సందర్శనలో జిల్లావ్యాప్తంగా 3,50,774 ఇండ్లను ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 298 ఇళ్లు ఎక్స్ మార్క్ ఇళ్లుగా గుర్తించబడినట్లు పేర్కొన్నారు. ఈ ఇళ్లలో అందుబాటులో లేని చిన్నారులను యుఐపిలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తిరిగి సందర్శించి పోలియో చుక్కలు వేయడంతో పాటు, ఆయా ఎక్స్ మార్క్‌లను పూర్తిగా తొలగించే చర్యలు చేపడతారని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 1,31,642 మంది చిన్నారుల లక్ష్యానికి గాను 99.3 శాతం మేర పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగిలిన అర్హులైన చిన్నారులను కూడా త్వరితగతిన గుర్తించి పోలియో చుక్కలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏ ఎన్ ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులకు అభినందనలు తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే యూనివర్సల్ ఇమ్యూనిజెషన్ ప్రోగామ్‌లో ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొని, పిల్లలకు నిర్దేశిత సమయానికి అన్ని టీకాలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ప్రయివేట్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అప్పని శంకర్‌రావు

- టిపియుఎస్ జిల్లా ఇన్‌ఛార్జి మారేపల్లి వెంకట్

**ఖమ్మం, జూన్ 30(మనం న్యూస్):** తెలంగాణ ప్రయివేట్ ఉద్యోగ సంఘం(టిపియుఎస్) జిల్లా అధ్యక్షుడిగా అప్పని శంకర్‌రావును నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్‌ఛార్జి మారేపల్లి వెంకట్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంకర్‌రావు నియామకం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు




సమక్షంలో జరిగినట్లు తెలిపారు. ప్రయివేట్ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం తమ సంఘం పోరాడుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు అప్పని శంకర్‌రావు మాట్లాడుతూ ప్రయివేట్ ఉద్యోగుల పని గంటలు తగ్గించాలని, అదనపు గంటలు పని చేస్తే దానికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, మహిళా ఉద్యోగులకు రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రయివేట ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. త్వరలోనే సంఘ సభ్యత్వాన్ని ప్రారంభించి పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కోటి, సెక్రటరీ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రాజా రత్నం, పట్టణ కార్యదర్శి షేక్ రాజిఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం



**ఖమ్మం, జూన్ 30(మనం న్యూస్):** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమిషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఒక్కరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా గడపాలని ఆకాంక్షించారు.

# ముంబై లో పవన్ కళ్యాణ్ హల్చల్!



**(అమరావతి, ముంబై, పి. మీరా హుస్సేన్ , మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ముంబై లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హల్చల్ చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మంగళవారం ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై ఇరువు రు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు సాగాయి. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్లోని తూర్పు కనుమ ల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపర మైన సమస్యలు తలెత్తాయి అని, ఈ క్రమంలో పులుల సంఖ్య పున రుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నాం అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, మహారాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి మనస్ఫూర్తిగా కృత జ్ఞతలు తెలియజేస్తున్నట్లు వ్యాఖ్యానించారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని, తూర్పు కనుమల్లో ఆడ పులుల ప్రవేశంతో అంతరసంతానోత్పత్తి సమస్యలను అధిగమించడం తోపాటు, జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహద పడుతుందని వివరించారు.ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ల డంలో మాకు నిరంతరం మార్గదర్శ కత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కి కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు వివరిం చారు. వన్య ప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వ యంతో ముందుకు వెళ్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# రికార్డు అసిస్టెంట్ అబ్దుల్ నబీ సేవలు ప్రశంసనీయం

- **సమాచార శాఖ ఉప సంచాలకులు కె. జయమ్మ**



**కర్నూలు, జూన్ 30:-**మనం న్యూస్ ప్రభుత్వ సేవలో నిబద్ధత, క్రమశిక్షణ, నిజాయితీతో నాలుగు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించిన రికార్డు అసిస్టెంట్ అబ్దుల్ నబీ సేవలు సమాచార ప్రశంసనీయమని సమాచార శాఖ ఉప సంచాలకులు కె. జయమ్మ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలులోని సమాచార శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో పదవీ విరమణ పొందిన రికార్డు అసిస్టెంట్ అబ్దుల్ నబీకి శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సంచాలకులు కె. జయమ్మతో పాటు శాఖ అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప సంచాలకులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగిగా సుమారు 40 సంవత్సరాల పాటు అబ్దుల్ నబీ ఎంతో అంకితభావంతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఉద్యోగ జీవితమంతా బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పనిచేస్తూ శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని అన్నారు. అప్పగించిన ప్రతి పనిని సమయపాలనతో పూర్తి చేస్తూ అధికారుల విశ్వాసాన్ని, సహోద్యోగుల అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగం అనేది కేవలం విధుల నిర్వహణ మాత్రమే కాకుండా ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం అని అబ్దుల్ నబీ తన సేవల ద్వారా నిరూపించారని తెలిపారు. తన మృదుస్వభావం, వినయం, సహోద్యోగులతో స్నేహపూర్వకంగా మెలగడం వంటి సద్గుణాలతో అందరి మన్ననలు పొందారని అన్నారు. కొత్తగా చేరిన సిబ్బందికి మార్గనిర్దేశనం చేస్తూ, కార్యాలయ పనుల్లో సహకరిస్తూ ఆదర్శ ఉద్యోగిగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో సహజమైన ఘట్టమని, అయితే సేవల ద్వారా సంపాదించిన గౌరవం, మంచి పేరు శాశ్వతంగా నిలిచిపోతాయని ఉప సంచాలకులు పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం అబ్దుల్ నబీ కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.అనంతరం శాఖ అధికారులు, సిబ్బంది ఒక్కొక్కరుగా అబ్దుల్ నబీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి ఆయన భావి జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ దివాకర్ రావు, డివిజనల్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సందీప్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఫర్జానా, ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె హరినాథ్ రెడ్డి. జిల్లా ఉపాధ్యక్షులు. శ్రీనివాసులు. కార్యాలయ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాంపల్లిలో ఆకట్టుకున్న రాతి దూలం లాగుడు పోటీలు



**తుగ్గలి, జూన్ 30 (మనం న్యూస్):** తుగ్గలి మండలంలోని రాంపల్లి గ్రామంలో కొలువైన కొశిరెడ్డి నాయన స్వామి 21వ ఆరాధన ఉత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఎద్దుల జట్లు తమ సత్తా చాటడంతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. పోటీలను మొదటి బహుమతి దాత ఏకాశి జయన్న ప్రారంభించారు. అనంతరం విజేతలైన యజమానులకు బహుమతులను అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.40 వేలు, రెండవ స్థానానికి రూ.30 వేలు, మూడవ స్థానానికి రూ.20 వేలు, నాలుగవ స్థానానికి రూ.15 వేలు, ఐదవ స్థానానికి రూ.10 వేలు, ఆరవ స్థానానికి రూ.5 వేల నగదు బహుమతులు అందించారు.

# పరుగు పందెం విజేతలకు నగదు పురస్కారం

**మంత్రాలయం, జూన్ 30,(మనం న్యూస్) :** మండల పరిధిలోని చెట్నెహళ్ళి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పరుగు పందెంలో గెలుపొందిన విజేతలకు మంగళవారం మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ నగదు బహుమతి అందజేసి సత్కరించారు. పరుగు పందెంలో మొదటి విజేత చాకలి హనుమంతు కుమారుడు శివకు రూ. 3 వేలు, రెండవ విజేత బోయ నాగేంద్ర కుమారుడు హనుమంతు కు రూ. 2 వేల నగదు బహుమతిగా అందజేశారు.



# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**మంత్రాలయం , జూన్ ,30 మనం న్యూస్:** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం రాఘవేంద్రపురం కాలనీకి చెందిన కరెంటు సుంకప్ప అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి దృష్టికి ఎంపిటిసి బోయ వెంకటేష్ తీసుకువెళ్ళారు. ఆయన ఆదేశాలు మేరకు ఎంపిటిసి బోయ వెంకటేష్ మృతిన్ని ఇంటికి వెళ్లి సుంకప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి , కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలకు రూ. 5 వేలు నగదు అందించారు. వారి పాటు టీడీపీ నాయకులు మద్రి శివకుమార్ , మిడిగలదిన్నె రఘు , కార్యకర్తలు సుంకప్ప మృతదేహానికి నివాళులర్పించారు.

# మన ధైర్యమే శక్తి యాప్

- **చిన్నారుల భద్రతనే మా లక్ష్యం.. మణికంఠ**



**నందికొట్కూరు(మనం న్యూస్)** శక్తి యాప్ అనేది ఆడపిల్లలకు ధైర్యం అని చిన్నారుల భద్రత కోసమే మేము పని చేస్తాము బ్రాహ్మణ కొట్టుకూరు ఎస్సై మణికంఠ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.బ్రాహ్మణకొట్కూరులో 'శక్తి యాప్'పై విస్తృత అవగాహన కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా శక్తి యాప్ ప్రయోజనాలపై మరియు మహిళల చిన్నారుల భద్రతపై, సైబర్ క్రైమ్ రోడ్డు ప్రమాదాలు ప్రస్తుత చట్టాలపై అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాలమేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ , మరియు నందికొట్కూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం సూచనలతో బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్.ఐ మణికంఠ మరియు పోలీసు సిబ్బంది మంగళవారం నాడు బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని (విజ్డమ్)పాఠశాలలో మహిళల భద్రత, బాలల సంరక్షణ, సైబర్ భద్రత అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి



**కర్నూలు జూన్ 30 మనం న్యూస్:** కర్నూల్‌లోని సి ఆర్ భవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి వలరాజు, బందెల నాసర్ జీ మాట్లాడుతూ1నుంచి 4 వరకు కర్నూల్ లో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుండి 500 మంది విద్యార్థుల హాజరుకానున్నారని, వివిధ రంగాల మేధావులు ప్రొఫెసర్లతో ఈ శిక్షణా తరగతులు నాలుగు రోజులపాటు సామాజిక రాజకీయ ఆర్థిక విద్య విధానాలపై ప్రత్యేకించి విద్యావ్యవస్థలో శాస్త్రీయ విజ్ఞానం పై లోతైన చర్చలు జరుగుతాయని అన్నారు అయితే పాలక ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరించి విద్యను క్రమంగా లాభసాటి ఫ్యాక్టరీగా మారుస్తూ, ప్రభుత్వ విద్యను విద్యార్థి హక్కులను అటకెక్కిస్తూ బానిసత్వపు ఆటవికపు రాజ్యాన్ని పాఠ్యాంశాల్లోకి ఎక్కించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రాథమిక దశ నుండే విచ్చిన్నం చేసే కాషాయీకరణ కార్పొరేటీకరణ తో అడుగులు వేస్తున్న పాలక ప్రభుత్వాలకు విద్యార్థులు ఓటు బ్యాంకు రాజకీయాల గా మారుతున్న నేపథ్యంలో శాస్త్రీయ విజ్ఞానం బదులు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులపై నేటికీ కులం పేరుతో సామాజికంగా దాడులు జరుగుతూనే ఉన్నాయని, చరిత్ర భాష ప్రాంతం సైన్స్ లాంటి అంశాలతో ముడిపడిన విజ్ఞానాన్ని కాస్త కార్పొరేట్ కూలీలుగా మార్చే రంగుల ప్రపంచంలో విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తన్న సందర్భంలో ఐఐఖిఊ రాష్ట్ర శిక్షణా తరగతులు పూర్తిగా అవగతం చేసుకొని పాలక ప్రభుత్వాల నియంత విద్యా వ్యతిరేక విధానాలపై నడుం బిగించాలని అన్నారు

# ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం పూర్తిచేయాలి




**ఎమ్మిగనూరు జూన్ 30 మనం న్యూస్** నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ యస్ ఐ ఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై ఎమ్మెల్యే స్పందించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో 2.53 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా డిజిటలైజేషన్ మరియు ఇంటింటి మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటివరకు కేవలం 8 శాతం లోపే పూర్తికావడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం అత్యంత ముఖ్యమని, ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్, ఇంటింటి సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు

# మచిలీపట్నం ఎం పి పూజలు

**మహానంది, జూన్30, మనంన్యూస్:** మహానందీశ్వర స్వామివారి సన్నిధిలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాల శౌరి పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారి దర్శనార్థమై వచ్చిన ఆయనకు ఆలయ ముఖమండపం వద్ద సూపర్డెంట్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ఆనవాయితి ప్రకారం కళ్యాణ మండపంలో వేదపండితులు శాంతారాం బట్ వేదాశీర్వచనం మధ్య కండువా కప్పి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వారివెంట జనసేనా నాయకులు కుంచపు ప్రసాద్, వడ్డే శీను,మారెడ్డి రామయ్య, తదితరులు వున్నారు

# బీఎల్ఓల నిర్లక్ష్యంతో కొత్త ఓటర్లకు అన్యాయం జరుగుతోంది



**దేవనకొండ, జూన్ 30, ( మనం న్యూస్ ):** దేవనకొండ మండలంలో జరుగుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బొల్లెద్దుల కిరణ్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిబంధనలను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాల్సి ఉండగా, కొంతమంది బీఎల్ఓలు ఒకే చోట కూర్చొని సర్వే పూర్తి చేస్తున్నట్లు చూపించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించే బాధ్యతాయుతమైన కార్యక్రమమని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామాలు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత వివరాలను నమోదు చేయాల్సిన బాధ్యతను అధికారులు విస్మరిస్తే, వేలాది మంది అర్హులైన యువ ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# నేడు ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి రాక



**కౌతాళం జూన్ 30 మనం న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తెలియజేయ డమేమనగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మంత్రాలయం శాసనసభ్యులు అయినటువంటి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బదినేహాల్ గ్రామానికి గ్రామ ప్రజల కోరిక మేరకు త్రాగు నీళ్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన నాలుగు మినీ ట్యాంక్ లను ప్రారంభోత్సవం చేయుటకు విచ్చేస్తున్నారు కావున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,గ్రామ మాజీ సర్పంచ్లు,ఎంపీటీసీలు అన్ని అనుబంధ సంఘాల నాయకులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# ఆగస్టు, సెప్టెంబర్ లో ప్రభుత్వమే క్రప్ హాలిడే జీవో ఇవ్వాలి

- **ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు డిమాండ్**
- **భారీ బైక్ ర్యాలీ నిర్వహణ**



**పాలకొల్లు, జూన్ 30,మనం ప్రతినిధి** రొయ్యల దాణ కంపెనీలు మేత ధరలు తగ్గించాలన్న, మంచి నాణ్యమైన రొయ్యి విత్తనాలు రావాలన్న, రొయ్యలకు గిట్టుబాటు ధరలు లభించాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో క్రాప్ హాలిడే ప్రకటించాలని, ఆమెరకు ఒక జీవో కూడా విడుదల చేయాలనిఆక్వా రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రొయ్యల దాన ధరలు తగ్గించక పోవడంపై పోవడంపై మంగళవారం పాత్రికేయుల సమావేశంలో గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ మేత కంపెనీల మొండి వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు స్వయంగా కిలోక్కు రూ. 4 తగ్గించాలని ఆదేశించిన కంటి తుడుపు గా రు. రెండు రూపాయల తగ్గించడంపై మేత కంపెనీల మొండి వైఖరి పట్ల ఆయన మండిపడ్డారు. ఫీడ్ ధరలు తగ్గించాలని, రొయ్యలకు గిట్టుబాటు ధరలు పెంచాలని రైతులతో కలిసి నినాదాలు చేశారు. 30వ తేదీన మంగళవారం నాడు వైరస్ చెరువులు తప్ప మిగిలిన చెరువులు పట్టుబడులు పట్టొద్దని, అలాగే మేత విక్రయ దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయాలని తమ సంఘం ఇచ్చిన పిలుపునకు స్పందించి రైతులు దుకాణ యజమానులు రాష్ట్రవ్యాప్తంగా సహకరించి నందుకు గాంధీ భగవాన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం నాయకులు ఎం జాన్ డేవిడ్ రాజు,పి సత్యనారాయణ రాజు, అధిక సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.

# అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భక్తిరస పారవశ్యం



**అన్నవరం, జూన్ 30, మనం న్యూస్ :** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని శ్రీ రాజా వెంకటరామరాయ కళామందిరంలో మంగళవారం భక్తి పారవశ్య వాతావరణంలో 'శ్రీ కృష్ణ మాధుర్యం - శ్రీమన్నారాయణీయం పారాయణం' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన మంజుల, యాదగిరి, ఉషారాణి, వంకాయల సత్సంగ బృందం సభ్యులు ఈ పారాయణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణుని దివ్యలీలలను, మహావిష్ణువు వైభవాన్ని కీర్తించే శ్లోకాలతో కళామందిరం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పారాయణాన్ని శ్రద్ధగా ఆలకించారు. సత్సంగ బృందం చేసిన పారాయణం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపగా, కార్యక్రమం ఆద్యంతం భక్తిమయంగా కొనసాగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీమన్నారాయణీయ పారాయణం యొక్క విశిష్టతను భక్తులకు చేరవేస్తూ, సత్యదేవుని సన్నిధిలో భక్తి, ఆధ్యాత్మిక విలువలను మరింత పెంపొందించే ప్రయత్నం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించిన టీడీపీ నాయకులు పన్నగ వెంకటేష్ స్వామి



**మంత్రాలయం , జూన్ ,30, మనం న్యూస్ :-** ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా మంత్రాలయంలోని సంతమార్కెట్ లో గ్రామ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను మంత్రాలయం టీడీపీ మండల కన్వీనర్ పన్నగా వెంకటేష్ , పూజారి వ్యాసరాజస్వామి , ఎంపిటిసి బోయ వెంకటేష్ , పట్టణ అధ్యక్షుడు వరదరాజు , వైసీపీ యువ నాయకులు బొంబాయి శివ తో కలిసి మంగళవారం పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పన్నగా స్వామి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంత్రాలయం లో ప్రతిఏటా ఎద్దుల బండలాగుడు పోటిలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు బండలాగుడు పోటిల ఆర్గనైజర్ సున్నం రామకృష్ణ టీడీపీ నాయకులు పన్నగా వెంకటేష్ స్వామి , పూజారి వ్యాసరాజస్వామి , ఎంపిటిసి బోయ వెంకటేష్ , పట్టణ అధ్యక్షుడు వరదరాజు వైసీపీ నాయకులు బొంబాయి శివ కు శాలువా కప్పి , పూలమాలలు వేసి సన్మానించారు

# అన్నవరంలో పారిశుధ్యం గాలికొదిలి... ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం?




**అన్నవరం, జూన్ 30, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీధి వీధిలో చెత్త సేకరణ కోసం వినియోగించాల్సిన చెత్త బండ్లు, ప్రక్షాళన పరికరాలను అధికారులు మూలకు చేర్చడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అనేక ప్రాంతాల్లో సకాలంలో చెత్త తొలగింపు లేకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ గ్రామంలో బ్లీచింగ్ చల్లడం, పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పాలకవర్గం ఉన్నప్పటికీ గ్రామ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై తగిన దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీలో కొత్త కార్యదర్శి బాధ్యతలు స్వీకరించినప్పటికీ పూర్తిస్థాయిలో పరిపాలన గాడిన పడలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామంలో పేరుకుపోతున్న చెత్త కారణంగా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పారిశుధ్య చర్యలను ముమ్మరం చేసి, చెత్త సేకరణను క్రమబద్ధీకరించడం, బ్లీచింగ్ చల్లడం, డ్రైనేజీలను శుభ్రపరచడం వంటి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో పారిశుధ్య వ్యవస్థను గాడిలో పెట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


# మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు మద్దతు తెలిపిన ముదునూరి...



**శంఖవరం జూన్ 30 మనం ప్రతినిధి:** మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళగిరిలో రాష్ట్ర మహిళ కమిషన్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అనుచిత వ్యాఖ్యలకు గానూ అమర్ నాథ్ ను మహిళా కమిషన్ విచారణకు పిలిచింది. అమర్నాథ్ తో పాటు ఆయన అడ్వకేట్ కూడా లోపలికి వెళ్లేందుకు రాగా ఆయన్ని కూడా పోలీసులు అనుమతించారు. అమర్నాథ్ కు మద్దతుగా ఉత్తరాంధ్ర నుండి ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్సీపీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎం ఎం ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో పోలీసులకు, వైసీపీ కార్యకర్తలకు కార్యాలయం బయట వాగ్వాదం నెలకొంది. విచారణకు హాజరయ్యే ముందు ఆయన మీడియాతో మాట్లాడారు.

హోం మంత్రి అనితపై తాను చేసిన కామెంట్లలో ఎలాంటి తప్పు లేదని అన్నారు.

# ఎంపీ ని సత్కరించిన నాయకులు



**కాట్రేనికోన జూన్ 30 మనం ప్రతినిధిః** రాజ్యసభ ఎంపీ గా ఎంపిక అయ్యి తొలిసారి గా అమలాపురం విచ్చేసిన సానా సతీష్ కి , టిడిపి నాయకులు విలేకరి రాజు,రవివర్మ, బిజెపి నాయకులు నంద్యాల చంటి, జనసేన నాయకులు సూరి నాయుడు సత్కారం చేసి అభినందనలు తెలిపారు. భారీ గజ మాల వేసి ఘనంగా సత్కారం చేశారు

# చిన్నారులకు ఇంటింటా పల్స్ పోలియో చుక్కలు



**అన్నవరం, జూన్ 30, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమం అనంతరం మిగిలిన చిన్నారులకు ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేకంగా ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేశారు. జూన్ 28న నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన చిన్నారులను గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టారు. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ప్రత్యేక సర్వే నిర్వహించి ఈ ప్రక్రియను కొనసాగించారు. తల్లిదండ్రులకు పోలియో నివారణపై అవగాహన కల్పించి ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆశ కార్యకర్తలు సూర్య కళ, కృష్ణవేణి సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని ఆరోగ్య శాఖ అధికారులు కోరారు. గ్రామంలో మిగిలిన అర్హులైన చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందించేందుకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు.

## సీషెల్స్‌లో ముగిసిన ప్రధాని మోడీ పర్యటన



**విక్టోరియా, జూన్ 30:** సీషెల్స్‌లో మూడురోజుల పర్యటన ముగించుకుని భారత ప్రధాని నరేంద్రమోడీ భారత్‌కు బయల్దేరారు. ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిల్లే, ప్రవాస భారతీయులు ఆయనకు విమానాశ్రయంలో వీడ్కోలిచ్చారు. తొలుత శాంతి ఉద్యానంలో మహాత్మాగాంధీకి నివాళులు అర్పించి, ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. గాంధీ ఆదర్శాలు తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని, శాంతి.. న్యాయం.. మానవ గౌరవాల కోసం ప్రజల్ని ఐక్యం చేయడంలో అవి ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు. ఉత్తమ ప్రపంచాన్ని చూడాలన్న ఉమ్మడి ప్రయత్నాలకు గాంధీ బోధనలు ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. చేతితో భారత జెండాలను ఊపుతూ ప్రవాసులు ఆయనకు స్వాగతం పలికారు. విక్టోరియాలోని వినాయక మందిరంలో మోడీ పూజలు చేశారు. ఇలాంటి ఆలయాల ద్వారా భారతీయ సంస్కృతిని విదేశాల్లో విస్తరింపజేస్తున్నారంటూ ప్రవాసుల్ని కొనియాడారు. ప్రవాస భారతీయులు అటు సీషెల్స్ పురోగతికి పాటుపడుతూనే ఇటు మాతృదేశంతో బలమైన సంబంధాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆదివారం రాత్రి సీషెల్స్ జాతీయదిన స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న మోడీ భారత సైనిక బలగాల కవాతును చూసినప్పుడు తన స్థానం నుంచి లేచి నిల్చొని గౌరవాన్ని ప్రకటించారు. అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళం దీనిలో పాల్గొన్నాయి.

# రెండు మహాసాగరాలు.. మంట పుట్టిస్తున్నాయి!



**ఢిల్లీ, జూన్ 30:** అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రం... ఆ రెండు మహాసాగరాలు భూగోళానికి చెరోవైపున ఉన్నాయి. వాటి మధ్య వేల కిలోమీటర్ల దూరం ఉంది. కానీ ఆ రెండూ ఇప్పుడు కోట్ల మందిని అతలాకుతలం చేస్తున్నాయి. వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసాగరంతో ఐరోపా, ఉత్తర అమెరికాలో హీట్‌డోమ్‌లు రారెత్తిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో అంతకంతకూ బలపడుతున్న ఎల్నినోతో భారత్లో నైరుతి రుతుపవనాలు చతికిలపడ్డాయి. ఈ రెండు మహాసాగరాలు కలిసి న్యూయార్క్ నుంచి న్యూఢిల్లీ వరకూ అసాధారణ వాతావరణ పరిస్థితులకు కారణమయ్యాయి. ఐరోపా వ్యాప్తంగా తీవ్రస్థాయి వేడి.. స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటిపోయాయి. అదే వాతావరణ పోకడ పశ్చిమ దిశగా వ్యాపిస్తోంది. దీంతో అక్కడున్న 'హీట్‌డోమ్' బలపడుతోంది. ఫలితంగా జులై మొదటివారంలో అమెరికాలోని చాలాచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఒక ప్రాంతంలో అధికంగా ఉన్న వాతావరణ పీడనం.. ఉపరితలానికి చేరువలోని వేడి గాలిని ఒడిసిపడితే హీట్‌డోమ్ ఏర్పడుతుంది. అధిక పీడనం కారణంగా కిందకి దిగుతున్న గాలి.. సంపీడనానికి గురై, వేడెక్కుతుంది. మరోవైపు మేఘాల జాడలేని ఆకాశం వల్ల సూర్యరశ్మి ఎక్కువగా నేలను తాకుతుంది. ఫలితంగా పుడమి వేడెక్కి, పొడిబారుతుంది. దీంతో నేలకు సమీపంలో ఉన్న గాలిలో మరింత సెగ పుడుతుంది. అంతిమంగా ఓ విష వలయంలా వాతావరణం వేడెక్కి అసాధారణ ఉష్ణోగ్రతలకు దారితీస్తోంది.

అట్లాంటిక్ మహాసాగరంలోని ఉత్తర ప్రాంతంలో ఉపరితలం తీవ్ర స్థాయిలో వేడిగా ఉండటం ఈ పరిస్థితులకు ఆజ్యం పోస్తోంది. దానివల్ల వాతావరణంలోకి అదనపు తేమ, వేడి వచ్చి చేరుతోంది. అప్పటికే వాతావరణంలో ఉన్న అధిక పీడన పరిస్థితులను అది మరింత తీవ్రం చేస్తోంది. దీనివల్ల హీట్డోమ్లు మరింత ఉద్ధృతమవుతున్నాయి. ఫలితంగా ఐరోపాలోని పలు దేశాలు ఉష్ణోగ్రతల ఉక్కుపిడికిలిలో చిక్కుకుపోయాయి.

భూగోళానికి మరోవైపున పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో మరోరకం పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడి ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల ఎల్నినో బలోపేతమై.. ఉష్ణమండల ప్రాంతాల్లో వాతావరణ ఆవర్తనం ఏర్పడింది. దీనివల్ల.. అరేబియా సముద్రం, బంగాళాఖాతం నుంచి తేమను భారత ఉపఖండానికి తీసుకెళ్లాల్సిన రుతుపవనాలు బలహీనపడ్డాయి. దీని దెబ్బకు నైరుతి రుతుపవనాల రాకలో జాప్యం జరిగింది. వచ్చాక కూడా భారత్లో మందగమనంతో సాగుతున్నాయి. జూన్‌లో దేశంలో ఏకంగా 42 శాతం వర్షపాత లోటుకు ఇది కారణమైంది. నిజానికి రుతుపవనాలు పూర్తిగా అదృశ్యంకాలేదని, వాటిని ముందుకు నడిపే 'ఇంజిన్' బలహీనపడిందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమధ్యరేఖను దాటి వచ్చే గాలులు తగ్గిపోవడం, మేఘాల ఏర్పాటు ప్రక్రియ దెబ్బతినడం, ఎల్నినో కారణంగా ఉష్ణమండల ప్రాంతంలో ఎండ తీవ్రతకు గాలి పైకి లేచే ప్రక్రియలో తేడాలు వంటివి కలగలిసి.. వర్షాన్ని కురిపించే వ్యవస్థలను దారుణంగా దెబ్బతీశాయి. దీంతో అవి మధ్య, ఉత్తర భారత దేశంలోకి చొచ్చుకెళ్లలేక చేతులెత్తేసే పరిస్థితి ఉత్పన్నమైంది. దీని ఫలితాలు సుస్పష్టం. దేశంలో రిజర్వాయర్లలో నీటిమట్టాలు నానాటికీ పడిపోతున్నాయి. రైతులు వర్షం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. నగరాల్లో వేసవి తరహా సెగలు కొనసాగుతున్నాయి. గాల్లో తేమ పెరిగిపోతోంది.

## కాంచీపురం స్కార్ఫ్.. ఇత్తడి తాబేలు

### సీషెల్స్ నేతలకు మోదీ కానుకలు



**ఢిల్లీ, జూన్ 30:** ఇటీవల సీషెల్స్‌లో మూడు రోజులు పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ అక్కడి నేతలకు భారత సంస్కృతి, హస్తకళా నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా పలు బహుమతులు ఇచ్చారు. సీషెల్స్ అధ్యక్షుడికి ఇత్తడి తాబేలును గిఫ్ట్గా ఇచ్చారు. దీనిని భారత దేశపు ఇత్తడి నగరంగా ప్రసిద్ధి చెందిన ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో తయారు చేశారు. ప్రథమ మహిళ వెరోనిక్ హెర్మినికి మహేశ్వరి సిల్క్ శాలువాను, ఒక బిద్రీవేర్ పెట్టెను మోడీ బహూకరించారు. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వర్‌లో తయారయ్యే ఈ మహేశ్వరి సిల్క్ శాలువాను పట్టు, పత్తి దారాలను మిళితం చేసి రూపొందించారు.

బిద్రీవేర్ పెట్టెలకు కర్ణాటకలోని బీదర్ ప్రసిద్ధి చెందింది. నల్లగా ఆక్సీకరణం చెందిన జింక్.. రాగి మిశ్రమ లోహంతో దీనిని రూపొందిస్తారు. సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్ళైకి సిక్కింలో తయారైన ఒక ఆర్కిడ్ కళా చిత్రాన్ని మోడీ బహుమతిగా ఇచ్చారు. ఇది సిక్కింలో లభ్యమయ్యే ఆర్కిడ్ జాతి పుష్పాలతో రూపొందించిన నెమలి చిత్రం. ఈ చిత్రానికి దౌత్యపరమైన సంబంధం కూడా ఉంది. నెమలి భారత జాతీయ పక్షి కాగా.. ఆర్కిడ్ సీషెల్స్ జాతీయ పుష్పం. సీషెల్స్ ఉపాధ్యక్షుడి సతీమణికి మోడీ కాంచీపురం స్కార్ఫ్‌ను బహుమతిగా ఇచ్చారు. ముదురు మెరూన్ రంగులో ఉన్న ఈ స్కార్ఫ్‌పై బంగారు జరీతో ఆలయ వాస్తుశిల్పాలను రూపొందించారు.

సీషెల్స్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టాకు తోడా ఎంబ్రాయిడరీ శాలువాను ఇచ్చారు. దీనిని తమిళనాడులోని నీలగిరి కొండల్లో ఉండే తోడా తెగ ప్రజలు తయారుచేస్తారు. సంప్రదాయ నేత పద్ధతిని ఉపయోగించి.. తెల్లటి కాటన్ వస్త్రంపై ఎంబ్రాయిడరీతో ఈ చేనేత వస్త్రాన్ని రూపొందించారు.

## ఇది 'ఆపరేషన్ టైగర్' కాదు.. 'ఆపరేషన్ దేవేంద్ర': ఆదిత్య ఠాక్రే



**ముంబయి, జూన్ 30:** మహా రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఇటీవల షిండే వర్గంలో చేరిపోగా.. తాజాగా ఓ ఎమ్మెల్సీ కూడా అదే బాటలో వెళ్లారు. అధికార కూటమి మహాయుతి తరఫున మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. తాజా పరిణామాలపై ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ ఈ ప్రభావం పార్టీపై ఏమాత్రం ఉండబోదన్నారు. ప్రతిపక్ష నాయకులను ప్రలోభపెట్టే ఈ ప్రయత్నం 'ఆపరేషన్ టైగర్' కాదని.. అది 'ఆపరేషన్ దేవేంద్ర ఫడ్నవీస్' అని విమర్శించారు.

తనకు సన్నిహితుడిగా పేరున్న ఎమ్మెల్సీ సచిన్ అహిర్ పార్టీ మారటంపై ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ.. అన్ని పదవులు పొందిన ఆయన స్వప్రయోజనాల కోసమే పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వాళ్లు అన్ని వ్యవస్థలపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టిన ఆయనే ఇప్పుడు వాళ్ల పక్కన కూర్చుంటున్నారని విమర్శించారు. అహిర్ వెళ్లిపోవడం వల్ల వర్లీ, శివ్డీ ప్రాంతాల్లో తమ పార్టీకి ఎటువంటి నష్టం ఉండదన్నారు.

శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు తమ పార్టీలో చేరినట్లు శివసేన అధినేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ షిండే ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తీవ్ర కష్టాల్లో కూరుకుపోయిన శివసేన (యూబీటీ)కి మరో ఎమ్మెల్సీ షాక్ ఇచ్చారు. అంతేకాదు.. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం సమక్షంలో మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు.

## జెట్ బ్లూ విమానాన్ని ఢీకొన్న డ్రోన్




**న్యూయార్క్, జూన్ 30:** అమెరికాలో ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న జెట్ బ్లూ ఎయిర్‌లైన్స్ విమానాన్ని.. న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఇంటర్నేషనల్ విమానాశ్రయ సమీపంలో డ్రోన్ ఢీకొట్టింది. లాస్ వెగాస్ నుంచి వచ్చిన ఈ విమానం 3 వేల అడుగుల ఎత్తులో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలో 159 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. విమాన కాకపిట్ వెలుపలి భాగాన్ని డ్రోన్ తాకిందని పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ కు తెలిపాడు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదని, విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని జెట్ బ్లూ ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు ప్రారంభించింది. విమానాశ్రయ పరిసరాల్లో ప్రతి నెలా దాదాపు 100 డ్రోన్లను గుర్తిస్తున్నామని.. నిషేధిత గగనతలంలో వీటిని ఎగరవేస్తే వారి లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఏఏ హెచ్చరించింది.

## ఆ అగ్నిపర్వతం నుంచి.. రూ.18.9 కోట్ల విలువైన బంగారం ధూళి గాల్లోకి




**రాస్‌ఐలాండ్, జూన్ 30:** అంటార్కిటిక్‌లోని ఎరెబస్ అగ్నిపర్వతం.. ఏటా రూ.18.9 కోట్ల విలువైన బంగారం ధూళి గాల్లోకి విరజిమ్ముతున్నట్లు జియోఫిజికల్ పరిశోధనలు వెల్లడించాయి. 1991 నాటి సర్వే ప్రకారం రాస్ ద్వీపం సమీపంలో ఉన్న ఎరెబస్ అగ్నిపర్వతం రోజుకు 80 గ్రాముల బంగారు ధూళి గాల్లోకి విరజిమ్ముతోంది. ఈ అగ్నిపర్వత లావా నుంచి విడుదలయ్యే వాయువులు స్వచ్ఛమైన బంగారు సూక్ష్మ కణాలను మోసుకెళ్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అవి అంటార్కిటిక్ మంచుపై స్థిరపడటానికి ముందు 1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయని తెలిపారు.

ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను ఉపయోగించి.. 60 మైక్రోమీటర్ల వరకు వ్యాసం కలిగి ఉండే ఈ బంగారు స్ఫటికాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. లావాతో పాటు స్వచ్ఛమైన బంగారు సూక్ష్మ స్ఫటికాలను వాతావరణంలోకి ఈ అగ్ని పర్వతం విడుదల చేస్తోందని చెప్పారు. అగ్నిపర్వత వాయువులలో బంగారం దొరకడం పూర్తిగా అసాధారణ విషయమేమీ కాదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. హవాయిలోని కిలావుయా, ఇటలీలోని మౌంట్ ఎట్నా, అలాస్కాలోని ఆగస్టీన్, మెక్సికోలోని ఎల్ చిచోన్ వంటి అగ్నిపర్వతాల వద్ద కూడా స్వల్ప మొత్తంలో బంగారాన్ని గుర్తించామన్నారు.

# సింధూ జలాల్లో చుక్క నీరు వదలట్లేదు

## భారత్‌పై పాక్ అక్కసు



**ఇస్లామాబాద్, జూన్ 30:** సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ ఒప్పందం విషయంలో యుద్ధానికైనా సిద్ధమేనంటూ ఇటీవల కవ్వింపులకు పాల్పడిన దాయాది.. తాజాగా మరోసారి భారత్పై ప్రేలాపనలు చేసింది. సింధూ జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ వ్యాఖ్యలు చేశారు.''సింధూ జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోంది. పాక్లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని అడ్డుకుంటున్నారు. మా నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం మాకు దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం'' అని మాలిక్ వ్యాఖ్యానించారు. పాక్ మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు.

సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ అక్కసు వెళ్లగక్కారు. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ల మధ్య 1960లో ఈ ఒప్పందం జరిగింది. అయితే, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ స్పష్టం చేసింది. 2028 జూన్ నాటికి సింధు నదీ జలాల ప్రవాహాన్ని పాకిస్థాన్‌కు పూర్తిగా నిలిపివేయవచ్చని భారత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలోనే పాక్ మంత్రులు దీనిపై స్పందిస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారు. నీటి సరఫరాను అడ్డుకునే విధంగా భారత్ వేగంగా చర్యలు తీసుకుంటోందని తమకు అనిపిస్తే, సైనిక చర్యలకూ వెనకాడబోమని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు.

# మోడీ నిద్రలేచే ఉంటారులే..

## ఉదయం 6 గంటలకు ఫోన్ చేయాలనుకున్న ట్రంప్

### యూఎస్ రాయబారి సెర్గియో గోర్





**వాషింగ్టన్, జూన్ 30:** భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఇరు దేశాధినేతల స్నేహం మూలస్తంభం అని యూఎస్ రాయబారి సెర్గియో గోర్ అన్నారు. వాషింగ్టన్ వేదికగా ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఆయన మోడీ-ట్రంప్ బంధాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ సంఘటనను గుర్తుచేసుకున్న ఆయన.. ప్రధాని మోడీకి ఓసారి ట్రంప్ ఉదయం ఆరు గంటలకే ఫోన్ చేయాలనుకున్నట్లు తెలిపారు. ''రెండు నెలల కిందట మియామిలో యూఎఫ్‌సీ ఈవెంట్ జరిగింది. ఆ సమయంలో నేను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్నాను. వేదిక పక్కన మేం మాట్లాడుకుంటూ ఉండగా.. 'మోడీకి కాల్ చేద్దాం' అని ట్రంప్ అన్నారు. 'ఇప్పుడు భారత్‌లో సమయం ఉదయం 6 గంటలు' అని నేను చెప్పా. దానికి అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఏం ఫర్వాలేదు. ఆయన నిద్రలేచే ఉంటారు. ఎక్కువ సేపు పడుకోరు. ఆయనకు నేనంటే ఇష్టం' అని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేరే బాధ్యతల్లో ఉండటంతో మోడీతో కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు. అయితే, ఈ సంఘటన వారిద్దరి మధ్య మైత్రిని చాటిచెబుతుంది. ఎవరితోనైనా స్నేహం చేస్తే.. ప్రతిదాన్నీ షెడ్యూల్ చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్‌ను చూశాక నాకనిపించింది. మోడీ ఆయనకు గొప్ప స్నేహితుడు'' అని సెర్గియో గోర్ వెల్లడించారు.

**లెటర్‌హెడ్‌లో పేరు మారితే పట్టించుకోవద్దు..**

కాగా.. ఈ సదస్సులో అమెరికా రాయబారి పలు అంశాల గురించి మాట్లాడారు. ఇటీవల అగ్రరాజ్యానికి చెందిన 'ఇండో-పసిఫిక్ కమాండ్' పేరులో 'ఇండో' పదాన్ని తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై సెర్గియో గోర్ స్పందిస్తూ.. ''లెటర్‌హెడ్‌పై ఏం పేరు ఉందన్న విషయాన్ని పట్టించుకోవద్దు. అమెరికా వాస్తవంగా ఏం చేస్తుందో.. ఆ చర్యలనే గమనించాలి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్-అమెరికా ఇప్పటికే పెద్ద సంఖ్యలో కలిసి సైనిక విన్యాసాలు చేస్తున్నాయి. రానున్న రెండు వారాల్లో భారత నేవీ బృందం అమెరికాలో పర్యటించనుంది. పేరు మారినంత మాత్రాన.. ద్వైపాక్షిక సంబంధాలు బలహీనపడ్డాయనుకుంటే పొరపాటే అవుతుంది. వాణిజ్యమైనా.. రక్షణ రంగమైనా.. భారత్-అమెరికా మధ్య బంధం బలంగా ఉంది'' అని గోర్ వివరించారు. ఇక, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా రాయబారి ప్రస్తావిస్తూ.. ''ట్రేడ్ డీల్‌పై తుది దశకు చేరుకున్నాం. చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. కేవలం ఒకటి లేదా 2 శాతం ఉత్పత్తులపై అంగీకారానికి రావాల్సి ఉంది. అతి త్వరలోనే ఈ ఒప్పందంపై ప్రకటన వస్తుంది'' అని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ భారత పర్యటన గురించి సెర్గియో గోర్ మాట్లాడారు. భారత్‌లో పర్యటించేందుకు అమెరికా అధ్యక్షుడు ఎదురుచూస్తున్నారని, మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ పర్యటన ఉండొచ్చని తెలిపారు.

# పటిష్టంగా సమాచార నెట్వర్క్

- **కనెక్టివిటీ టూ లాస్ట్ మైల్ అనేదే లక్ష్యం**
- **రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్వర్క్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**



**(అమరావతి,పి.మీరాహుస్సేన్, మనం ప్రత్యేక ప్రతినిధి):** సమాచార నెట్వర్క్ అంశంలో ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్వర్క్ ను ఏర్పాటు చేయటం ద్వారా సమాచార వ్యవస్థలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ దిశగా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు. కమ్యూనికేషన్ నెట్ వర్క్ ను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్వర్క్ పై సీఎం వివిధ సర్వీసు ప్రొవైడర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మొబైల్ కవరేజి విషయంలో సర్వీసు ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు, కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏపీ వ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మరిన్ని సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉన్నాయని.. మరో 2310 సెల్ టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం అవసరమైన మేరకు సర్వీసు ప్రొవైడర్లకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. వంద రోజుల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. భౌగోళికంగా కవరేజి లేని ప్రాంతాల వివరాలను ఇస్తామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో ఫైబర్ ద్వారా సమాచార నెట్వర్క్ ను ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడా తవ్వకాలు జరక్కుండా ప్రతీ ఇంటికీ ఫైబర్ నెట్వర్క్ అందిస్తామన్నారు. ఏపీ వ్యాప్తంగా 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్వర్క్ తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**డిజిటల్ లిటరసీకి సహకారం**

రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ లిటరసీకి కూడా సర్వీసు ప్రొవైడర్లు సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, సంజీవని పథకం సహా వివిధ టచ్ పాయింట్ ల సేవల్ని సమర్ధంగా వినియోగించుకునేలా ఈ డిజిటల్ లిటరసీ ఉపకరిస్తుందన్నారు. ప్రజలను డిజిటల్ లిటరేట్లుగా మారిస్తే మొబైల్ ఫోన్ ద్వారా ఎక్కువ సేవలు అందించేందుకు అస్కారం ఉంటుందన్నారు.

# సమాజ హితం... కావాలి అభిమతం..!

## దినదిన ప్రవర్తమానంగా విస్తరిస్తున్న వైద్యరంగం

### ఆధునాతన వైద్యానికి హబ్‌గా సూర్యాపేట

### భవిష్యత్తుకు భరోసా ఇస్తున్న వైద్యులు

### సంపాదన కంటే మానవత్వంకే వైద్య సేవ ప్రాధాన్యత అవసరం

### వైద్యుల దినోత్సవం సందర్భంగా మనం ప్రత్యేక కథనం



సూర్యాపేట, జూన్ 30 (మనం ప్రతినిధి): డాక్టర్ చేతిలో 'స్టెతస్కోప్' ఎంత ముఖ్యమో... సమాజహితం... కావాలి వైద్యుల అభిమతం.... రోగుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని.. అంతే స్థాయిలో వైద్య సహాయం అందించటం వైద్యులకు అంతే ముఖ్యం... అనటంలో సందేహం లేదు.మన ఇంట్లో ఎవరికైనా అర్ధరాత్రి గుండెనొప్పి వచ్చినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది ఎవరు? పసిబిడ్డకు జ్వరం వచ్చినప్పుడు తల్లి మొదట ఫోన్ చేసేది ఎవరికి?ఒక ప్రమాదం జరిగినప్పుడు ప్రాణం కోసం ఎదురుచూసేది ఎవరి కోసం?డాక్టర్ కోసం...మన జీవితంలో ఎంతో ముఖ్యమైన స్థానం వైద్యులకు ఉంది.

ముప్పై, నలభై సంవత్సరాల క్రితం సూర్యాపేటలో వైద్య సదుపాయాలు పరిమితంగా ఉండేవి...ఏరియా ఆసుపత్రి మాత్రమే నిరుపేదలకు వైద్యం అందించింది.. ఆ కాలంలో కొద్దిమంది వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండేవారు. క్లిష్టమైన వ్యాధి అంటే హైదరాబాద్ ప్రయాణం తప్పనిసరి.కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా కనుమరుగు అయిపోయిందని చెప్పవచ్చు.సూర్యాపేట ఇప్పుడు కేవలం జిల్లా కేంద్రమే కాదు... వైద్య సేవల 'హబ్గా'... ఎదిగింది. ఏరియా ఆసుపత్రి నుంచి మెడికల్ కాలేజీ స్థాయికి ఎదగడం ఒక ఎత్తు అయితే... కొన్ని డజన్ల మందిగా ఉన్న వైద్యుల సంఖ్య నేడు దాదాపు 300 మంది వైద్యుల వరకు చేరటం గమనార్హం... సాధారణ వైద్యం నుంచి అధునాతన టెక్నాలజీల తో సూపర్ స్పెషాలిటీ వైద్యం వరకు విస్తరించడం మరో ఎత్తు.. ప్రాథమిక చికిత్స నుంచి తృతీయ స్థాయి టెలిటరీ కేర్ వైద్య సేవల వరకు అందుబాటులోకి రావడం ప్రభుత్వ పాలకుల కృషి అభినందనీయం అని చెప్పక తప్పదు.. గుండె, కిడ్నీ, మెదడు, నవజాత శిశువులు, అత్యవసర వైద్యం వంటి ప్రత్యేక సేవలు స్థానికంగా లభించడం నూతన శకానికి అద్దం పడుతుంది.ఇది ప్రజల విశ్వాసం, వైద్యుల అంకితభావం, సమాజ సహకారం కలిసి సాధించిన విజయం అంటే తప్పుకోదేమో.వైద్య రంగం... ఆరోగ్య సేవ మాత్రమే కాదు, వైద్య వృత్తి వేల కుటుంబాలకు జీవనాధార మైంది.. ఈ వృత్తి నమ్ముకొని దీనిపై ఆధారపడి వేలాది కుటుంబాలు బ్రతుకుతెరువు అయింది... వాస్తవానికి వైద్య రంగం ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ...నేడు సూర్యాపేట జిల్లాలో వైద్య రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి పైగా కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది.. అంటే ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు...నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, అంబులెన్స్ డ్రైవర్లు, హౌస్ కీపింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, క్యాంటీన్లు, మెడికల్ దుకాణాలు డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వహణ తో ఎన్నో కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి.వైద్యం కోసం దూర భారం వెళ్లాల్సిన పరిస్థితి నేడు లేదు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.. ఎంతోమంది నిషి నార్దులు ఆ విభాగాలలో స్పెషలిస్టులుగా ఇక్కడే వైద్యం అందిస్తుండటం... నిరుపేదలకు కొంత ఉపశమనం కలిగిస్తుందని అనడంలో అతిశయోక్తి కాదు.

ఆరోగ్య రక్షణ లేదనేది బహిరంగ రహస్యం ... ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు తమ మెరుగైన వైద్య రీతిలో చికిత్స పేరుతో దోపిడీకి పాలు పడకుండా తక్కువ లాభం చేసుకుని నిరుపేదలకు వైద్యం అందించినప్పుడే.. వైద్యో నారాయణ హరి అన్న చేతులకోసం ఇలా చెప్పుకుంటూ పోతే సమాధానం ఒక్కటే అదే వైద్యుడు..కానీ మనం మనల్ని మనమే ఒక ప్రశ్న అడగాలి మన జీవితంలో అంత ముఖ్యమైన స్థానం కలిగిన వైద్యులను మనం ఎంతవరకు అర్థం చేసుకుంటున్నాం నిజమే ఇందులో అన్ని సంస్థలు లాగే ఇక్కడ కూడా వైద్యం వ్యాపారంలో మారింది... కానీ నేటికీ పాత తరం వైద్యులు ఇంకా ప్రజా సేవ చేస్తూ వైద్య వృత్తిలో ఉంటూ సేవలు చేస్తుండటం మర్చిపోకూడదు..

కొంతమంది వ్యవహరిస్తున్న తీరు మిగతా వైద్యులకు పోల్చి చూడడం ఎంతవరకు సమంజసం అనే భావన వ్యక్తం అవుతుంది..

### మూడు తరాలుగా వైద్య సేవలు డాక్టర్ రమేష్ చంద్ర...



మూడు తరాలుగా పోరాటాల పురిటి గడ్డైన సూర్యాపేట నేలపై వైద్య సేవలు అందిస్తున్న కుటుంబ సభ్యుడిగా ఉండడం తనకెంతో గర్వంగా ఉందని డాక్టర్ రమేష్ చంద్ర అన్నారు..మా పెద్దలు చూసిన సూర్యాపేట, మా తండ్రి సేవలందించిన సూర్యాపేట, నేడు మనం చూస్తున్న సూర్యాపేట ఇవన్నీ కలిసి ఒక అద్భుతమైన అభివృద్ధి గాథను చెబుతున్నాయి. ముప్పై మంది వైద్యుల నుంచి మూడు వందల మంది వైద్యుల వరకు ముప్పై, నలభై సంవత్సరాల క్రితం సూర్యాపేటలో వైద్య సదుపాయాలు చాలా పరిమితంగా ఉండేవి కొద్దిమంది వైద్యులు మాత్రమే వైద్య సేవలను అందించేవారు. ఒక ఏరియా ఆసుపత్రి.క్లిష్టమైన వ్యాధి అంటే హైదరాబాద్ ప్రయాణం తప్పనిసరి..కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.సూర్యాపేట ఇప్పుడు కేవలం జిల్లా కేంద్రమే కాదు తెలంగాణలో ఒక ప్రధాన వైద్య సేవల కేంద్రంగా ఎదిగింది అనడంలో ఎలాంటి సందేహం ఉండాల్సిన అవసరం లేదు.

#### వైద్యుడు ఉన్నచోటే ఆరోగ్య భరోసా...

వైద్యులను ప్రశ్నించండి.సందేహాలు అడగండి. వివరణ కోరండి.అది ప్రజలహక్కు.కానీ.. అదే పరిస్థితుల్లో.. అపనమ్మకంపెంచకండి. అవమానించకండి. హింసను ఆశ్రయించకండి. ఎందుకంటే ఒక వైద్యుడి మనసుకు తగిలిన గాయం, సమాజ ఆరోగ్య వ్యవస్థకే గాయం అవుతుందనేది మర్చిపోకూడదు... ప్రజలందరం కలిసి నడుద్దాం... ప్రజలు లేక పోతే వైద్యులు లేరు అనేది సత్యం ...వైద్యులు లేక పోతే ప్రజల చందంగా దేవుడికి ప్రతిరూపంగా ప్రజలకు వైద్యుడు కనిపిస్తాడు...

#### సంపాదన కంటే మానవత్వం కలిగిన వైద్య సేవ గొప్పది...

వైద్యం ఒక ఉద్యోగం లేక వ్యాపారమో కాదు మానవసేవ ఒక్క క్షణం ఆగి ప్రజలంతా ఆలోచిద్దాం అర్ధరాత్రి గుండెనొప్పి వచ్చినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది ఎవరు..పసిబిడ్డకు జ్వరం వచ్చినప్పుడు తల్లి ముందుగా ఫోన్ చేసేది ఎవరికి..రోడ్డు ప్రమాదంలో ప్రాణాలతో పోరాడుతున్న వ్యక్తి ఎదురుచూసేది ఎవరి

#### సూర్యాపేట చైతన్యానికి నిలయం వైద్య సేవలకు చిరునామా...

సూర్యాపేట అంటే కేవలం ఒక పట్టణం కాదు ఇది పోరాటాల చరిత్ర, ప్రజా చైతన్యం, సామాజిక బాధ్యతలకు ప్రతీక ఇక్కడ జరిగిన

తెలంగాణ సాయుధ పోరాటంలో రైతు, కూలీ, మహిళ, యువకుడు కలిసి అన్యాయానికి ఎదురు నిలిచిన నేల ఇది. ప్రజల ఐక్యతకు చరిత్ర సాక్ష్యంగా నిలిచిన ఈ భూమి ఎన్నో విప్లవాలకు దిక్సూచి గా నిలిచింది..అందుకే కవి గర్వంగా ఆలపించాడు చుట్టుముట్టు సూర్యాపేట నట్టనడుమ నల్లగొండ అనే విప్లవస్ఫూర్తినిచ్చే గీతం కేవలం ఒక గేయమే కాదు ఇది సూర్యాపేట ప్రజల ఆత్మగౌరవానికి చాటి చెప్పిన విషయం అనేది నేటి తరం మరవకూడదు.

#### వైద్య సేవలో విప్లవాత్మకమైన మార్పులు...

పేట జిల్లా కేంద్రంలో మూడు దశాబ్దాలుగా వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి ఇందులో భాగంగానే ఏరియా ఆసుపత్రి నుంచి మెడికల్ కాలేజీ స్థాయికి ఎదగడం కొన్ని డజన్ల మంది వైద్యుల నుంచి దాదాపు 300 మంది వైద్యుల వరకు పెరగడంసాధారణ వైద్యం నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యం వరకు విస్తరించడం ప్రాథమిక చికిత్స నుంచి టెర్షియరీ కేర్ సేవల వరకు అందుబాటులోకి రావడం గుండె, మెదడు, కిడ్నీ, నవజాత శిశువులు, అత్యవసర వైద్యం వంటి ప్రత్యేక సేవలు స్థానికంగా లభించడం ఇది ఇలా యాదృచ్ఛికంగా జరిగిన అభివృద్ధి కాదు ఇది ప్రజల విశ్వాసం, వైద్యుల అంకితభావం, నాయకుల దూరదృష్టి, సమాజ సహకారం కలిసి సాధించిన విజయం అని చెప్పుకోక తప్పదు. అయితే మరో వాస్తవాన్ని కూడా మనం అంగీకరించాలి. నేటి పరిస్థితుల్లో వైద్యుడు రోగి మధ్య ఉన్న నమ్మకం గతంతో పోలిస్తే కొంత సన్నగిల్లింది ఈ దూరాన్ని తగ్గించడం ఇప్పుడు మనందరి బాధ్యత.

# సీజ్ చేసిన గంజాయి నిర్వీర్యం




- ఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్తలు
- యాదాద్రి జిల్లా తుక్కాపుర్ గ్రామంలో గల రోమా ఇండస్ట్రీస్ నందు అత్యాధునిక సాధనంతో బూడిద చేశాం
- జిల్లా కె.నరసింహ

సూర్యాపేట, జూన్ 30 (మనం ప్రతినిధి): 29 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 227.18 కేజీ గంజాయినీ ప్రభుత్వ, కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో మంగళవారం యాదాద్రి జిల్లా లో గల తుక్కాపుర్ గ్రామం లోగల రోమా ఇండస్ట్రీస్ నందు యాజమాన్యం, సిబ్బంది సహాయంతో ప్రభుత్వ సాక్షుల సమక్షంలో గంజాయిని నిర్వీర్యం చేసి బూడిద చేయడం జరిగినది అని డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఎస్పి నరసింహ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పర్యావరణానికి, ప్రజా జీవనానికి ఎలాంటి హానీ కలగకుండా జాగ్రత్తలు తీసుకుని నిర్వీర్యం చేయడం జరిగినది అన్నారు. దీనివిలువ 1 కోటి పైనే ఉంటుంది అన్నారు.డ్రగ్స్ నివారణ అందరి సామాజిక బాధ్యత. డ్రగ్స్, గంజాయి వినియోగించడం వల్ల యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగం నేరం అని ఎస్పి తెలిపారు. గంజాయి నివారణ లో జిల్లా పోలీసు కృషి చేస్తుంది అన్నారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా, వినియోగం కు సంభందించి పోలీసులకు, డయల్ 100, 112, 1908 కు సమాచారం ఇవ్వాలి పేర్కొన్నారు.డగ్స్, గంజాయి వియోగించే వారిని, వ్యాపారం చేసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపినారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను గమనిస్తూ చెడు వ్యసనాలకు లోనవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు సూర్యాపేట డివిజన్ డి.ఎస్.పి.ప్రసన్న కుమార్, కోదాడ డివిజన్ డి.ఎస్.పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో డీఎస్పీ రవి, ఏఆర్ డిఎస్పీ నరసింహ, ఎస్ఐ లు యాకూబ్, జాన్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

#### జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు...

శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి జూలై ఒకటి వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని, సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని స్పష్టం చేశారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవు అని సూచించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందాలి



సూర్యాపేట, జూన్ 30 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాలకు అందించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పేదింటి మహిళలు సద్వినియోగపరుచుకోవాలని సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, పెన్ పహాడ్, సూర్యాపేట అర్బన్ రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ.1,50,17,400 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు జగదీష్ రెడ్డి మాట్లాడుతూ... కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని వీటిని ప్రతి ఒక్క పేదింటి మహిళ సద్వినియోగపరుచుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి, గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



తిరుమలగిరి జూన్ 30 (మనం న్యూస్) తిరుమలగిరి మున్సిపాలిటీలోని మాలిపురంలో లార్డ్స్15 లక్షల నిధులతో నిర్మించనున్న ఎస్.సి కమ్యూనిటీ హాల్ కు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుమణి యాదగిరి, కేసిడి కవిత,బత్తుల శ్రీను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వై. నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, మూల అశోక్ రెడ్డి, కందుకూరి లక్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలి



- అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసుకోవాలి
- ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ, జూన్ 30( మనం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం (ఆర్అండ్ఆర్) ప్రక్రియలను వేగవంతం చేసి, సంవత్సరంలోపు అన్ని ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పెషల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈలు), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (డీఈలు), అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు), ల్యాండ్ అక్విజిషన్ అధికారుల (ఎల్ఏఓలు)తో జిల్లా కలెక్టర్ ప్రాజక్టుల భూసేకరణ పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు.ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాసం (ఆర్అండ్ఆర్) పనులను వేగంగా పూర్తి చేసి నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి నిధులు సమకూర్చుకుని ప్రాజెక్టులను నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలని తెలిపారు. ఆర్అండ్ఆర్ కాలనీల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, వారి సహకారంతో పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేయడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టుల అమలులో నిర్లక్ష్యం, జాప్యం లేదా అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెన్షన్కు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, అసిస్టెంట్ కలెక్టర్ ( ట్రైని) శ్రీకాంత్ రెడ్డి , స్పెషల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇరిగేషన్ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలు, ల్యాండ్ అక్విజిషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

## రైతు భరోసా సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో): ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, అందులో భాగంగానే ఇటీవల విత్తనమేళాలు నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.

మంగళవారం హైదరాబాదు నుంచి ప్రతి రైతుకు ఎకరానికి రూ.12000 పంట పెట్టుబడి సాయంను వారి ఖాతాల్లో జమ చేసే రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని గద్వాల మండలం చేనుగోనుపల్లి గ్రామ రైతువేదికలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రైతులతో కలిసి టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, పలు శాఖల ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి రైతు భరోసా కార్యక్రమంలో తమ ప్రసంగాన్ని ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ, పిఏసిఎస్ చైర్మన్ సుభాన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏవో ప్రతాప్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల ఖాతాల్లోకి వర్షాకాలం రైతు భరోసా నిధుల విడుదల

- రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కేశవ్ పాటీల్ వెల్లడి



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ జిల్లాలో 3.43 లక్షల మంది రైతులకు రూ.423 కోట్ల రైతు భరోసా తొమ్మిది రోజుల పాటు దశలవారీగా ఖాతాల్లో జమ అవ్వనున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు రైతులకు సాగు పెట్టుబడి భారం తగ్గించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద వర్షాకాలం సాగుకు సంబంధించిన నిధుల విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. హైదరాబాద్లోని శిల్పకళా వేదిక నుంచి బటన్ నొక్కి రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని నాగర్కర్నూల్ జిల్లా మంతటి గ్రామ రైతు వేదికలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమం అనంతరం రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..., రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతున్నాయని తెలిపారు. మొత్తం 73.32 లక్షల మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారన్నారు. మిగిలిన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. నాగర్కర్నూల్ జిల్లాలో రైతు భరోసా పథకం కింద మొత్తం 3 లక్షల 43 వేల 604 మంది రైతులకు సుమారు రూ.423 కోట్ల నిధులు విడుదల కానున్నాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. నేటి నుంచి ప్రారంభమై రానున్న తొమ్మిది రోజుల పాటు రైతుల అర్హత, భూ విస్తీర్ణం ఆధారంగా దశలవారీగా నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా కలెక్టర్ చెప్పారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. నిధుల జమకు సంబంధించిన సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినట్లయితే సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వర్షాకాలం సాగు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో రైతు భరోసా నిధులు సకాలంలో అందడం వల్ల విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోలుకు ఆర్థికంగా భరోసా నిధులు రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మంతటి గ్రామ రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ ,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు.

# అర్హత గల ఓటు తొలగించకుండా చూడాలి



భీమదేవరపల్లి జూన్ 30 మనం న్యూస్: అర్హత గల ఓటును తొలగించకుండా చూడాల్సిన బాధ్యత మనదే అని కాంగ్రెస్ నాయకులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంగళవారం రోజున భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్న ప్రభాకర్ హాజరు కాగా గ్రామ సర్పంచ్ గోపగాని తిరుపతి ఆహ్వానించి సన్మానించిన అనంతరం సిసి రోడ్లు పనులు ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సర్వే సవరణ కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని ప్రతి ఒక్కరూ అర్హత కలిగిన ఓటును సవరించుకోవాలని ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పార్టీ నాయకులు సహకరించి పూర్తి చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో పడని ఓట్లను తొలగించగా, రాష్ట్రంలో తటస్థంగా కోటి ఓట్లు ఉండగా నియోజకవర్గంలో 61 వేల ఓట్లు, మన మండలంలో 11 ఓట్లు తటస్థంగా ఉన్నాయని అత్యధికంగా తటస్థ ఓట్లు ఉన్న మండలం మనదేనా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి గృహలక్ష్మి ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ, గత ప్రభుత్వం రేషన్ కార్డులు పంపిణీ చేయక ఇబ్బంది పడ్డ నిరుపేదలకు దరఖాస్తు చేసుకోగానే రేషన్ కార్డుల పంపిణీ చేశామని, డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మండలంలో ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేసామని గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత రవాణా, గ్రామ సమాఖ్య మహిళా గ్రూపులకు ఒక్కొక్క బస్సు ఇవ్వడం జరిగిందని, మరొక బస్సు ప్రతి మండల మహిళా సమాఖ్య గ్రూపులకు అందజేస్తామని అన్నారు. ఎలినోవా ప్రభావం ద్వారా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా దిగుబడి రావాలని భగవంతుని కోరుకున్నారని అన్నారు. ధర్మారం గ్రామానికి రోడ్డు పనులు, 40 లక్షల సిసి రోడ్లు మంజూరు చేసినందుకు గ్రామస్తుల తరఫున గ్రామ సర్పంచ్ గోపగాని తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ గోపగాని తిరుపతి, ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ మొక్కల స్రవంతి ఎమ్మార్వో రాజేష్, ఎంపీడీవో వీరేశం, సీఐ పులి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కేతిరి లక్ష్మారెడ్డి,మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, కొలుగురి రాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఆదరి రవీందర్, చిట్టంపల్లి ఐలయ్య, ఊస కోయిల ప్రకాష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్ ,ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, మంగ రామచంద్రం, ఎర్రబెల్లి సర్పంచ్ కాలేరు శ్రావణ్, దబ్బ శంకర్ , కొడకండ్ల సుదర్శన్ రెడ్డి,మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిగురాల స్వరూప, అన్నపూర్ణ, మంజుల, స్నేహలత, తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



మహాదేవపూర్ జూన్ 30మనం న్యూస్: మహాదేవపూర్ మండలం చంద్రుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో తాసిల్దార్ సత్యానారాయణ స్వామి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం ను మంగళవారం రోజున ఘనంగా నిర్వహించారు. మండలంలోని చంద్రు పల్లి గ్రామంలో షెడ్యూల్ తెగలు మరియు కులాలపై గ్రామంలో ఏదైనా అంటరానితనంగానే అస్పృశ్యత గాని వివక్షత గాని ఉన్న యెడల వాడి గురించి చర్చించుటకు మరియు వాటి నిర్మూలించుటకు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ సత్యనారాయణ స్వామి గ్రామ ప్రజలకు మరియు పౌరులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సత్యనారాయణ స్వామి, చండుపల్లి సర్పంచ్ గురుసింగ బాపు, వాడు సభ్యులు, గిరిధవార్ రఘు, గ్రామ పలనాధికారి రాజశేఖర్, అటవీ శాఖ మరియు విద్యుత్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు సిబ్బంది, పలు సంఘాల నాయకులు మెరుగు లక్ష్మణ్ మరియు ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తేజవత్ బెల్లయ్యను కలిసిన రవీందర్



హనుమకొండ,జూన్ 30(మనం న్యూస్): తేజావత్ బెల్లన్న జాతీయ ఆదివాసి కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తెలంగాణ స్టేట్ ట్రై కార్ చైర్మన్ అన్న కి శాలువా బొకేతో శుభాకాంక్షలు తెలిపిన గుగులోత్ రవీందర్ నాయక్, డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్, వరంగల్ జిల్లా వారు శుభాకాంక్షలు తెలియజేశారు. మీరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, మరెన్నో విజయాలు సాధిస్తూ ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

## మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



వరంగల్, జూన్ 30(మనంన్యూస్): జాతీయ లక్ష్యమైన 95-95-95 సాధన దిశగా 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాతీయ లక్ష్యమైన 95-95-95 సాధనపై విస్తృతంగా చర్చించారు. తొలి '95' లక్ష్యంలో మార్చి నెలలో నమోదైన 23 శాతం నుంచి ప్రస్తుతం 68 శాతానికి పురోగతి సాధించినప్పటికీ, ఇంకా లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉన్నందున రానున్న మూడు నెలల్లో అన్ని శాఖల సమన్వయంతో 95 శాతం లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతి రోగి క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారందరికీ వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా నిరంతరం పర్యవేక్షించడం ద్వారా వైరల్ లోడ్ తగ్గి రోగులు ఆరోగ్యంగా జీవించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మూడో '95' లక్ష్యంలో ఉన్న 1.5 శాతం అంతరాన్ని త్వరగా అధిగమిస్తే రాష్ట్రంలోనే ఉత్తమ కేంద్రంగా నిలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత అధికారులతో త్వరలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి 95-95-95 లక్ష్య సాధనకు కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారి స్రమేష్, రాష్ట్ర బేసిక్ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ డా. జయలక్ష్మి, టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్, రాష్ట్ర సమన్వయకర్త కామేశ్వరరావు, ఇన్చార్జి డీఎంహెచ్ఓ డా. ప్రకాష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. అరుణ్కుమార్ జోషి, డీపీఎం స్వప్న మాధురి, డీఐఎస్ రామకృష్ణ, సహాయోగి మంజులతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కోట రాజబాబు



మహాదేవపూర్ జూన్ 30మనం న్యూస్: మహాదేవపూర్ మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ కోట రాజబాబు స్వయంగా ఇంటింటికి వెళ్లి పరిశీలించారు.ఈసందర్భంగా బి ఎల్ వో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లతో మాట్లాడి కార్యక్రమం పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అర్హులైన ఓటరు పేరు జాబితాలో నమోదుఅయ్యేలాబాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలు ఎస్ ఐఆర్ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి, తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు అస్రార్ ఖురైషి, కాంగ్రెస్ నాయకులు ఐత తిరుపతి రెడ్డి,ముఖిద్, బి ఎల్ ఓ తోట శ్యామల మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ డా. సత్య శారద



వరంగల్, జూన్ 30(మనంన్యూస్): ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను జిల్లా కలెక్టర్ డా.సత్య శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీలో సంబంధిత మెడికల్ సూపరింటెండెంట్ ధర్మరాజ్ ,ఆయుర్వేదిక కాలేజీ ప్రిన్సిపాల్ ృట.ఓ.అనసూర్య, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఐని ఘనంగా సన్మానించిన ఆత్మ చైర్మన్ చిటమట రఘు

ములుగు,జూన్ 30మనం ప్రతినిధి : ఏటూరునాగారం పోలీస్ స్టేషన్లో నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సూర్య ప్రకాష్ ను జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ సీనియర్ నాయకులు, యువజన, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## పర్వతగిరి రైతు వేదికలో వర్చువల్గా రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం



- సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించిన రైతులు

పర్వతగిరి, జూన్ 30: హైదరాబాద్ శిల్పకళా వేదికలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేసిన కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా పర్వతగిరి రైతు వేదికలో వర్చువల్గా ప్రసారం చేశారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు. ఈ వేదికగా రైతులకు ఎల్నినో ప్రభావం, పంటల మార్పిడి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలు,ఆయిల్ ఫాం పంటల నిర్వహణ, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులను పిపిటి ద్వారా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అందరి ఆదారభిమానాలతో సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు

- రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అమరేందర్ సేవలు చిరస్మరణీయం
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో): భగవద్గీత గీత సారాంశం శ్రీకృష్ణుడు అర్జునుడితో స్థితప్రజ్ఞతపై వివరించే అంశాన్ని మరాఠీలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ చదివి వినిపించారు. మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అమరేందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందుతున్న అదనపు కలెక్టర్ పి. అమరేందర్ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి, పుష్పగుచ్ఛం సమర్పించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు తాహసిల్దార్లు రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని అమరేందర్కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఒక విధి నిర్వహణ మాత్రమే కాదన్నారు. సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు. అలాంటి అవకాశాన్ని పి. అమరేందర్ అత్యంత బాధ్యతాయుతంగా, నిబద్ధతతో వినియోగించుకున్నారని కొనియాడారు. రెవెన్యూ శాఖలో ఆయనకు ఉన్న అపారమైన అనుభవం, చట్టాలపై ఉన్న పట్టు, సమస్యల పరిష్కారంలో చూపిన సమర్థత జిల్లా పరిపాలనకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. జిల్లాలో క్లిష్టమైన రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అమరేందర్ అందించిన సూచనలు, సలహాలు ఎంతో విలువైనవని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుండేవారన్నారు. అమరేందర్తో కలిసి పనిచేసిన అనుభవాలను కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పలు సందర్భాల్లో తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను అమరేందర్ తనతో పంచుకున్నారన్నారు. అవి పరిపాలనలో ఎంతో ఉపయోగపడే విషయాలని తెలిపారు. యువ అధికారులకు మార్గదర్శకంగా నిలిచే వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు.



# ఇందిరమ్మ రాజ్యమే ధ్యేయంగా సంక్షేమం, అభివృద్ధికి ముఖ్య ప్రాధాన్యత

- ప్రస్తుత సాంకేతిక రంగంలో ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేదు
- ప్రజలు వాట్సాప్ లో సమస్యలను తెలిపినా వెంటనే పరిష్కరించాలి
- ప్రజా పాలనతో పౌరులకు పారదర్శక సేవలందించాలి
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి
- రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 30 (మనం బ్యూరో): ఇందిరమ్మ రాజ్యమే ధ్యేయంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి అధికారులు ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి హాజరై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకుముందు మంత్రికి శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి జూపల్లికి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిది మంది దివ్యాంగులకు త్రిచక్రవాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రసంగిస్తూ... ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. వాట్సాప్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేసినా వెంటనే పరిష్కరించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు సేవకులుగా ఉండి పని చేస్తేనే ప్రజా పాలనకు సార్థకత ఉంటుందన్నారు. ఏ స్థాయి వ్యక్తులు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చినా వారిని గౌరవప్రదంగా ఆహ్వానించలన్నారు. సావధానంగా వారు చెప్పేది విని వాటిని వారం రోజుల్లోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి ప్రజలకు కమ్యూనికేషన్ పెరిగేందుకు హెల్ప్ డెస్క్ మాదిరి రెండు ఫోన్ నెంబర్స్ కేటాయించాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల వారీగా సంబంధిత అధికారులు తమ పనితీరును, చేపట్టిన అభివృద్ధి పనులను గురించి వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సంబంధిత రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను కూడా పరిష్కరించి సంబంధిత ప్రజలకు లబ్ధి చేకూరేలా పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఈ సీజన్లో ప్రభుత్వం సూచించిన వరి వంగడాలనే రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. క్లస్టర్ల వారీగా ఏఈవోలు తమ పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని చేరవేసేందుకు రైతుల ఫోన్ నెంబర్లతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వ్యవసాయ రంగ విశేషాలను షేర్ చేయాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. ఆర్డీఎస్ పరిధిలోని మల్లమ్మ కుంట రిజర్వాయర్ సామర్థ్యాన్ని నాలుగైదు టీఎంసీలకు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. అమృత్ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన తాగునీటి పనులను సకాలంలో పూర్తయ్యేలా సంబంధిత అధికారులు పనులను వేగవంతం చేయాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో అక్షరాస్యతను పెంచేందుకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక రుగ్మతల నివారణకు మహిళ, రైతు సంఘాలను భాగస్వాములను చేస్తూ ప్రజలకు అవగాహన కలిగేలా సాంస్కృతిక శాఖ ద్వారా కృషి చేస్తామన్నారు. ...జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించడమే కాక అక్కడ సిబ్బంది మెరుగైన పని తీరు కనబరిచేలా పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళాలను నిర్వహించి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను ఇప్పించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కూడా త్వరగా పూర్తి చేయించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా తమ అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ...గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.... గద్వాలలో రూ.10 కోట్ల నిధుల అంచనాతో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు పూర్తయ్యేందుకు అవసరమైన అదనపు నిధులను మంజూరు చేయించి త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మొదట పంపు హౌస్ ల నిర్మాణం పూర్తి చేస్తే గద్వాల పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీటిని అందించడానికి వీలవుతుందన్నారు. జిల్లాలో పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులతో కలిసి ముందుకెళ్తున్నానన్నారు. ...రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి సహకార సంస్థ చైర్పర్సన్ సరిత మాట్లాడుతూ... జిల్లాలో అమ్మాయిలు చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితులు ఉండరాదు అంటే పెద్ద ఎత్తున జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, బీసీ వసతి గృహాలలో సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు. జిల్లాలో గొర్రెల కాపరులకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అలంపూర్ శాసనసభ్యులు విజేయుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్లు హనుమంతు, దొడ్డప్ప, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పని చేసినప్పుడు మన కోసం మనం ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు

## – ఐశ్వర్య రాజేష్



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ గత కొద్ది కాలంగా ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ భామ గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ భారీ విజయంతో మళ్లీ ఫామ్ లోకి వచ్చిన ఐశ్వర్య.. వరుస అవకాశాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ ఓ సుకుమారితో బిగ్ స్క్రీన్ పై సందడి చేయనన్నారు. అలాగే 'ఇసాకపట్నం' అనే క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ తో ఓటీటీ ప్రియులను అలరించనున్నారు. అయితే ఈ సిరీస్ జూలై 2 నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ సిరీస్ కు సంబంధించిన అప్డేట్స్ సోషల్ మీడియాలో భారీ బజ్ ను క్రియేట్ చేశాయి. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో.. ప్రమోషన్స్ జోరు పెంచిన ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఐశ్వర్య తన వ్యక్తిగత అలవాట్ల గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు.

సినిమా కోసం అంతలా కష్టపడినప్పుడు మనకు మనం బహుమతులు ఇచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆమె చెప్పుకొచ్చారు. 'నేను నటించే ప్రతి సినిమా పూర్తయ్యాక నాకు నేను ఒక గిఫ్ట్ కొనుక్కుంటాను. అంత కష్టపడి పని చేసినప్పుడు మన కోసం మనం ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు' అని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తన లైఫ్ లో కొనుక్కున్న అత్యంత ఖరీదైన గిఫ్ట్ గురించి చెబుతూ..'నా కెరీర్ లోనే అత్యంత ఎక్స్ పెన్సివ్ గిఫ్ట్ ఒక లగ్జరీ వాచ్. దాని ధర అక్షరాలా 15 లక్షల రూపాయలు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పెద్ద హిట్ అయ్యాక.. ఆ చిత్రానికి వచ్చిన రెమ్యునరేషన్ తో ప్రత్యేకంగా ఈ వాచ్ కొనుక్కున్నాను' అని వెల్లడించారు. ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒక వాచ్ కోసం అంత భారీ మొత్తంలో ఖర్చు పెట్టడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ బ్రాండెడ్ వాచ్ లో ఏదో ఒక స్పెషాలిటీ ఉండే ఉంటుందని కామెంట్లు పెడుతున్నారు.

# వైభవ్ అరంగేట్రంపై ఆసక్తి

- ఇంగ్లాండ్‌తో తొలి టీ20..



ఐర్లాండ్ తో టీ20 సిరీస్ ఓటమి నుంచి ఇంకా తేరుకోని టీమ్ఇండియా మరో సిరీస్ కు సిద్ధమైంది. ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు మ్యాచ్ల టీ20 సిరీస్ మొదలుకానుంది. పసికూన ఐర్లాండ్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్ ల్లో ఓటమిపాలై అప్రతిష్ఠపాలైన భారత జట్టు.. బలమైన ఇంగ్లాండ్ ను వారి సొంతగడ్డపై ఎలా నిలువరిస్తుందా? అని క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఐర్లాండ్ పై యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని అంతా భావించినా అది జరగలేదు. వైభవ్ కు అవకాశం ఇవ్వకుండా విమర్శలపాలైన టీమ్ఇండియా మేనేజ్ మెంట్ ఇంగ్లాండ్ పై కచ్చితంగా ఈ కుర్రాడిని ఆడించే అవకాశాలున్నాయి. బుధవారం జరిగే తొలి టీ20లోనే వైభవ్ అరంగేట్రం ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఐర్లాండ్ పై విఫలమైన సంజు శాంసన్, ఇషాన్ కిషన్ లో ఒకరిని బెంచ్ కే పరిమితం చేసి అభిషేక్ తో కలిసి వైభవ్ ను ఓపెనింగ్ కు పంపే ఛాన్స్ ఉంది. ఒకవేళ ఛాన్స్ వస్తే వైభవ్ ఇంగ్లాండ్ బౌలర్లను ఎలా ఎదుర్కొంటాడనేది ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ 2026లో ప్రపంచ స్థాయి బౌలర్ల బౌలింగ్ ను సైతం ఊచకోత కోసిన ఈ కుర్రాడు పేస్ కు అనుకూలించే ఇంగ్లాండ్ పిచ్ లపై ఎలా ఆడతాడో చూడాలి. ముఖ్యంగా జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ లో వైభవ్ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే వీరిద్దరూ ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ కు ఆడారు. వైభవ్ బలహీనతలు ఏంటో ఆర్చర్ కు తెలిసి ఉండొచ్చు. సూర్యవంశీని ఎలా కట్టడి చేయాలి? అని ఐపీఎల్ సందర్భంగా ఆర్చర్ కు ప్రశ్న ఎదురవగా.. టోర్నీ ముగిసిన తర్వాత సమాధానం చెబుతానన్నాడు.

**బలంగా ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్**

హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్, జోర్డాన్ కాక్స్, జాకబ్ బెతెల్, విల్ జాక్స్, ఫిల్ సాల్ట్, టామ్ బాంటన్ వంటి ఆటగాళ్లతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. వీరిని అర్ష్ దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్ లతో కూడిన పేస్ దళం ఎలా కట్టడి చేస్తుందో చూడాలి. తొలి మ్యాచ్కు ఆతిథ్యం ఇవ్వనున్న చెస్టర్-లె-స్ట్రీట్ లోని రివర్ సైడ్ గ్రౌండ్ మైదానం బౌలర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ గత ఎనిమిది మ్యాచ్ ల్లో బౌలర్లదే ఆధిపత్యం. సగటు స్కోరు 138 కాగా.. అత్యధిక స్కోరు 195. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం బుధవారం రాత్రి 10 గంటలకు మొదలుకానుంది.

**ఐదు టీ20ల సిరీస్ కోసం ఇరు జట్ల వివరాలు:**

భారత్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, సూర్యాంశ్ షెడ్గే, ప్రసిద్ధ్ కృష్ణ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అర్ష్ దీప్ సింగ్, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్.

ఇంగ్లాండ్: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, టామ్ బాంటన్, జాకబ్ బెతెల్, జోస్ బట్లర్, జేమ్స్ కోల్స్, జోర్డాన్ కాక్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, విల్ జాక్స్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్.

# హర్మన్‌కే పగ్గాలు..

## ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టు ఇదే..

ఈ ఏడాది ఆసియా గేమ్స్ కు భారత మహిళల జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్ ప్రీత్ కెప్టెన్ గా వ్యవహరించనుండగా.. స్మృతి మంధానను వైస్ కెప్టెన్ గా నియమించింది. ఇటీవల మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ నుంచి మన జట్టుఫైనల్ కు చేరకుండానే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ హర్మ్న మేనేజ్ మెంట్ నమ్మకం ఉంచి.. ఆసియా క్రీడల కు సారథ్య బాధ్యతలను అప్పగించింది.

ప్రపంచకప్ లో బరిలోకి దిగిన జట్టులోని మిగతా సభ్యుల్లోనూ పెద్దగా మార్పులు చేయలేదు. వికెట్ కీపర్ బ్యాటర్ యస్తికా భాటియాను మాత్రమే తప్పించి.. ఆమె స్థానంలో జి. కమిలినిని బీసీసీఐ ఎంపిక చేసింది. ప్రపంచకప్ టోర్నీ సమయంలో గాయపడిన శ్రేయాంక పాటిల్ కు ఆసియా క్రీడల్లోనూ స్థానం కల్పించారు. అయితే, టోర్నీకి ముందు ఆమె ఫిట్ నెస్ ను నిరూపించుకోవాల్సి ఉంటుంది.

జపాన్ వేదికగా సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. 2023లో చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో టీమ్ఇండియా మహిళల జట్టు స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మన అమ్మాయిలు డిఫెండింగ్ ఛాంపియన్స్ గా టోర్నీలో దిగనున్నారు.

**భారత జట్టు ఇదే..**

హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి.కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ



# 'టాక్సిక్' విజువల్ వండర్‌గా ఉంటుంది: హ్యూమా ఖురేషీ



'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్ ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్ గా ఉండనుందని స్పష్టం చేశారు. ''ఈ సినిమాలో యశ్ తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయి'' అని హ్యూమా అన్నారు. ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్ లో కనిపించనున్నారు. ఓనం, ఈద్, రక్షాబంధన్ పండగలతో పాటు లాంగ్ వీకెండ్ కావడంతో ఈ వరుస సెలవుల్ని సద్వినియోగం చేసుకునేందుకే ఆగస్టు 26ను విడుదల తేదీగా ఖరారు చేసినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. పీరియాడిక్ గ్యాంగ్ స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్ దాస్ తెరకెక్కించారు. కియారా, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# ఆశ్చర్యపోయేలా తెరపై నా పాత్ర

''ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశా'' అంది కథానాయిక నభానటేశ్. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె ఆ తర్వాత క్రమం తప్పకుండా అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నభా నటేశ్ సోమవారం హైదరాబాద్ లో విలేకర్లతో ముచ్చటించారు.

''నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా''.

''నేను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్ గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుంది. కథానాయకుడు విరాట్ కర్ణ ఎంతో తపన ఉన్న నటుడు. ఆయనకి ఇది రెండో సినిమానే అయినా ఎంతో అనుభవం ఉన్నట్టుగా నటించారు''.



''కథలపైనే నా దృష్టంతా. మంచి కథలు అనుకున్నప్పుడు అందులో చేసే పాత్ర గ్లామర్ కోణంలో ఉందా లేక, అందుకు భిన్నంగా ఉందా అనేది పట్టించుకోను. సామాజిక మాధ్యమాల్లో నాకు ప్రేమే ఎక్కువ దొరికింది. నన్ను ఇబ్బంది పెట్టేంతగా ఎప్పుడూ ఎవ్వరూ విమర్శించలేదు. సానుకూల దృక్పథంతో ఆలోచించడం అలవాటు. అందుకే వ్యతిరేకమైన భావాలు నా దగ్గరకు రావు''.

''సినీ ప్రయాణం సవ్యంగానే సాగిపోతున్న దశలో నాకు ప్రమాదం జరిగింది. భుజానికి గాయమైంది. దాంతో ఏడాదిన్నరపాటు నటనకు విరామం వచ్చింది. లేదంటే మరిన్ని సినిమాలు చేసేదాన్ని. శారీరకంగా, మానసికంగా బలంగా ఉంటేనే సినిమాలు చేయాలనేది నా అభిప్రాయం. తెరపై ఉత్సాహంగా కనిపించినప్పుడు పాత్రకి న్యాయం జరుగుతుంది. అందుకే పూర్తిగా కోలుకున్నాకే మళ్లీ నటించడం మొదలుపెట్టా. రాగానే నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేసే అవకాశం లభించింది. 'డార్లింగ్'తోపాటు, భారీస్థాయిలో రూపొందుతున్న 'నాగబంధం', 'స్వయంభూ' చిత్రాల్లో నటించే అవకాశాలు దొరికాయి. ఇప్పుడు 'నాగబంధం', త్వరలోనే విడుదల కానున్న 'స్వయంభూ' చిత్రాలు నాకు మరింత పేరు తీసుకొస్తాయి''.

# హీరో మహేశ్ బాబుకు షాకిచ్చిన GSTAT.. AMBతో సహా ఐదు థియేటర్లపై కొరడా

మూవీ టికెట్లపై జీఎస్టీ (GST) రేట్లు తగ్గినా.. ఆ ప్రయోజనాన్ని ప్రేక్షకులకు వర్తింపజేయకుండా లాభపడినందుకు గాను సూపర్ స్టార్ మహేష్ బాబు కు చెందిన అఋ సినిమాస్ తో సహా తెలంగాణలోని ఐదు థియేటర్లపై వస్తు సేవల పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్ (GSTAT) కఠిన చర్యలు తీసుకున్నది. కేంద్ర జీఎస్టీ చట్టంలోని యాంటీ-ప్రాఫిటీరింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను మొత్తం రూ.1.7 కోట్లను వినియోగదారుల సంక్షేమ నిధికి జమ చేయాలని ఆదేశించింది. కాగా, మూవీ టికెట్లపై 2019 జనవరి 1 నుంచి జీఎస్టీని తగ్గించినప్పటికీ, సదురు థియేటర్లు బేస్ టికెట్ ధరలను పెంచి తుది ధరను యథాతథంగా ఉంచాయి. దీంతో ప్రేక్షకులకు దక్కాల్సిన బెనిఫిట్స్ థియేటర్లే పొందాయని ట్రిబ్యునల్ నిర్ధారించింది. ఇక ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని ఏఎంబీ వాదనను GSTAT తోసిపుచ్చింది. ప్రభుత్వ అనుమతులు ఉన్నా కేంద్ర జీఎస్టీ నిబంధనల నుంచి మినహాయింపు లభించదని స్పష్టం చేసింది. ఏఎంబీ సినిమాస్ వాటాగా తేలిన రూ.1.1 కోట్లలో ప్రస్తుతం రూ.35 లక్షలు జమ చేయాలని ఆదేశించింది. అదేవిధంగా నిబంధనలు ఉల్లంఘించినందుకు విశ్వనాథ్ 70ఎంఎం, ఏఎస్ఆర్ సినిమా, కుమార్ 70ఎంఎం థియేటర్లకు జూన్ 28, 2019 నుంచి 18 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉల్లంఘనలు జనవరి 1, 2020 కంటే ముందే జరిగినందున, సాంకేతిక కారణాల రీత్యా థియేటర్లపై ఎలాంటి అదనపు జరిమానాలు విధించలేదు.

**థియేటర్ల వారీగా చెల్లించాల్సిన మొత్తాలు ఇలా..**

ఏఎంబీ సినిమాస్ ఎల్ఎల్ పీ: రూ.35 లక్షలు
జ్యోతి థియేటర్: రూ.19.8 లక్షలు
భ్రమరాంబ సినిమాస్: రూ.11.8 లక్షలు
ఏఎస్ఆర్ సినిమా ఎల్ఎల్ పీ: రూ.9.6 లక్షలు (+18 శాతం వడ్డీ)
విశ్వనాథ్ సినిమా: రూ.9 లక్షలు(+18 శాతం వడ్డీ)
కుమార్ 70ఌ రూ.2.5 లక్షలు (+18 శాతం వడ్డీ)




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.